

ఘంటసాల మండలం పూషడంలో నీట మునిగిన వరి చేలు



తోట్లవల్లూరు లంకలో వరదకు నీట మునిగిన పసుపుతోట



తోట్లవల్లూరు మండలం ఐలూరు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానదీ పాయ

విస్తారంగా కురుస్తున్న వర్షాలు, కృష్ణానదికి ఎగువ నుంచి వస్తున్న భారీ వరద జిల్లా వాసులను భయపెడుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి ఇప్పటికే 5.52 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో పులిగడ్డ ఆక్విడెక్టును తాకుతూ ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తూ వరద కడలివైపు పరుగులు తీస్తోంది. నదీపరివాహక ప్రాంతంలోని లంక గ్రామాలను చుట్టేసింది. కాలువలు, డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 16,965 ఎకరాల్లోని వరి పొలాలు నీటమునిగాయి. లంక గ్రామాల్లోని వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. గంటగంటకు వరద తీవ్రత పెరుగుతుండటంతో ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ అప్రమత్తమయ్యారు. అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ దిశానిర్దేశం చేశారు.



పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద వరద ఉధృతి



చల్లపల్లి మండలం నడకుదురు కరకట్టపై విరిగిన చెట్లను తొలగిస్తున్న సీఐ ఈశ్వరరావు, పోలీసు సిబ్బంది



తోట్లవల్లూరు లంకలో ఉన్న గొర్రెలను పడవపై తీసుకొచ్చిన కాపరులు

ముంపు భయం

ప్రకాశం బ్యారేజీ నుంచి 5.52 లక్షల క్యూసెక్కుల విడుదల

- పులిగడ్డ ఆక్విడెక్టు వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవాహం
- లంక గ్రామాలను చుట్టుముట్టిన వరద నీరు
- 16,965 ఎకరాల్లో నీట మునిగిన వరి పొలాలు
- జిల్లా సగటు వర్షపాతం 31.8 మిల్లీ మీటర్లు
- అధికారులను అప్రమత్తం చేసిన ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ



పాత ఎడ్లంక వాసులను పునరావాస కేంద్రాలకు రమ్మని కోరుతున్న పోలీస్ అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: వర్షపు నీరు, వరద నీరు జిల్లాను చుట్టుముట్టింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా గురువారం కూడా వర్షం కురిసింది. ప్రకాశం బ్యారేజీ నుంచి సాయంత్రం ఐదు గంటల సమయానికి 5.52 లక్షల క్యూసెక్కుల వరకు నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. ఎగువ ప్రాంతం నుంచి వరద వచ్చి చేరుతుండటంతో ఆరు లక్షల క్యూసెక్కుల వరకు ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు నీటిపారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. వరద నీరు పులిగడ్డ ఆక్విడెక్టును తాకుతూ ప్రమాదకరస్థాయిలో సముద్రంలో కలుస్తోంది. తోట్లవల్లూరు, ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, కంకిపాడు, పెనమలూరు తదితర మండలాల పరిధిలోని లంక భూముల్లో సాగు చేసిన ఉద్యానపంటలు నీటమునిగాయి. పసుపు, కంద, ఇతర కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. మండల ప్రత్యేక అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. గురువారం ఉదయం 8.30 గంటల వరకు ఉంగుటూరులో అత్యధికంగా 116.2 మిల్లీమీటర్లు, గన్నవరంలో 103.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సగటు వర్షపాతం 31.8 మిల్లీ మీటర్లుగా ఉంది. గుడివాడలో మధ్యాహ్నం గంటపాటు భారీవర్షం కురిసింది.

నీటిలో వరి పొలాలు

జిల్లాలో ఇప్పటివరకు 2,81,803 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి, తోట్లవల్లూరు, ఉయ్యూరు, పెదపారుపూడి, గుడివాడ, పెడన, పామర్రు మొవ్వ, నాగాయలంక తదితర మండలాల్లోని వరి పొలాలు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 19 మండలాల్లోని 16,965 ఎకరాల్లో నారు మడులు, నాట్లు వేసిన పొలాలు, పిలకతొడిగే దశలో ఉన్న వరిపైరు ముంపునకు గురైనట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. పొలాల్లోకి వర్షపు నీరు రెండు అడుగులకుపైనే చేరింది. డ్రెయిన్‌లు పొంగి ప్రవహిస్తుండటంతో పొలాల్లోని నీరు ఎప్పటికి తగ్గుతుందో తెలియడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. చల్లపల్లి, మోపిదేవి, తోట్లవల్లూరు, అవనిగడ్డ, మిగతా 8లో..

కరకట్టపై విరిగిపడిన చెట్లు

చల్లపల్లి మండల పరిధిలోని రాముడుపాలెం, నాదెళ్లవారిపాలెం, మోపిదేవి మండల పరిధిలోని కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో కరకట్టపై చెట్లు విరిగిపడ్డాయి. రాకపోకలకు ఆటంకం ఏర్పడటంతో పోలీసులే రంగంలోకి దిగారు. చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మోపిదేవి ఎస్‌ఐ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది చెట్ల కొమ్మలు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.



బ్యారేజీకి పోటెత్తిన వరద

- పులిచింతల, వాగులు, బుడమేరు నుంచి చేరిన వరద
- రెండో ప్రమాద హెచ్చరిక ఇవ్వాలనుకున్న అధికారులు
- మధ్యాహ్నం నుంచి తగ్గిపోయిన పులిచింతల అవుట్‌ఫ్లో
- బ్యారేజీ వద్ద మూడు కాల్వలకు నీటి విడుదల నిలుపుదల

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): పులిచింతల ప్రాజెక్టు నుంచి ప్రకాశం బ్యారేజీకి గురువారం కూడా భారీగా వరద చేరింది. పులిచింతలతో పాటు ఎగువన ఉన్న వాగులు, బుడమేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి వస్తున్న నీరంతా ప్రకాశం బ్యారేజీకి చేరుతోంది. ఇప్పటికే బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గురువారం నాటి పరిస్థితి రెండో ప్రమాద హెచ్చరిక జారీచేసే సూచనలను చూపించింది. ఎగువ నుంచి ఉదయం 4,50,240 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. 70 గేట్లను పూర్తిస్థాయిలోకి ఎత్తి ఆ మొత్తాన్ని దిగువకు పంపారు. ఈ ఇన్‌ఫ్లో మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ పెరిగింది. అక్కడి నుంచి గంటగంటకూ పెరిగి మధ్యాహ్నం 3 గంటలకు ఇన్‌ఫ్లో 5,65,807 క్యూసెక్కులకు చేరింది. ఆ మొత్తం నీటిని అధికారులు సముద్రంలోకి వదిలారు. జలవనరుల శాఖ నిబంధనల ప్రకారం బ్యారేజీ నుంచి 3,97,750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. అదే అవుట్‌ఫ్లో 5,66,860 క్యూసెక్కులు ఉంటే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. బ్యారేజీ లాక్ ఆఫీసు సిబ్బంది మధ్యాహ్నం 3 గంటలకు తీసిన రీడింగ్ చూసి రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేయాలేమో అనుకున్నారు. ఆ తర్వాత ఇన్‌ఫ్లో తగ్గుతూ వచ్చింది. నాలుగు గంటల నుంచి పులిచింతల నుంచి విడుదల చేసే నీటి పరిమాణం తగ్గడంతో బ్యారేజీకి ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. సాయంత్రం 6 గంటలకు బ్యారేజీకి 3,85,139 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, 5,46,019 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీకి అనుబంధంగా ఉన్న కాల్వల పరిధిలోని గ్రామాలకు, పొలాలకు నీటి అవసరం ప్రస్తుతానికి లేకపోవడంతో నీటి విడుదలను నిలుపుదల చేశారు. ఏలూరు కాల్వకు 306, రైవస్ కాల్వకు 300 క్యూసెక్కులు మాత్రమే విడుదల చేస్తున్నారు. మిగిలిన కేఈ ప్రధాన, బందరు, కేడబ్ల్యూ, గుంటూరు చానళ్లకు నీటి విడుదలను నిలుపుదల చేశారు.

10 మందికి పోలీస్ సేవా పతకాలు

- జిల్లా స్పెషల్ బ్రాంచి ఏఎస్‌ఐ లక్ష్మణస్వామికి ఉత్తమ సేవా పతకం
- మిగిలిన తొమ్మిది మందికి సేవా పతకాలు

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందించే ప్రతిష్ఠాత్మక పోలీస్ సేవా పతకాలకు పది మంది ఎంపికైనట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ సేవా పతకానికి జిల్లా స్పెషల్ బ్రాంచి ఏఎస్‌ఐ వై.లక్ష్మణస్వామి, సేవా పతకాలకు పెనమలూరు ఎస్సై ఎ.డి.ఎల్.జనార్ధన్, జిల్లా స్పెషల్ బ్రాంచి ఏఎస్‌ఐ కె.హేమానందం, మచిలీపట్నం పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కె.వి.శ్రీనివాసరావు, అవనిగడ్డ హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు, డీఏఆర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ జె.నందకిషోర్, మహిళా పోలీస్ స్టేషన్ డబ్ల్యూఏఎస్‌ఐ బి.శాంతకుమారి, డీఏఆర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ షేక్ ఇబ్రహీం, గుడివాడ టూటౌన్ కానిస్టేబుల్ షేక్ రిహాన్, కంకిపాడు కానిస్టేబుల్ పి.రాధాకృష్ణ ఎంపికయ్యారని పేర్కొన్నారు. పతకాలు సాధించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఈ సందర్భంగా ఎస్పీ గంగాధరరావు అభినందించారు.

గుడివాడ కోర్టుకు వల్లభనేని వంశీ 10

ప్రగతి పథంలో.. ఉచిత ప్రయాణం



సిటీ టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన భారీ టెంట్

నేటి నుంచే స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 763 బస్సుల్లో అమలు
- ఏడాదికి రూ.360 కోట్ల వరకు ప్రభుత్వంపై భారం
- మహిళల ఆక్యుపెన్సీ 30-50 శాతం పెరిగే అవకాశం
- మొత్తం ఆక్యుపెన్సీ 60-80కి చేరుతుందని అంచనా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించేందుకు ఉమ్మడి కృష్ణాజిల్లాలో అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న ఈ పథకానికి నగరంలోని పీఎన్‌బీఎస్ వెంబడి సిటీ బస్‌పోర్టు వేదిక కానుంది. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్త్రీ శక్తి పథకాన్ని జెండా ఊపి ప్రారంభిస్తారు.

763 బస్సుల్లో ఉచిత ప్రయాణం

ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 1,191 ఆర్టీసీ బస్సులకు గానూ 763 బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఈ ఉచిత ప్రయాణం అమలుకానుంది. దూరప్రాంత ప్రయాణాలకు కూడా ప్రభుత్వం అవకాశం కల్పించటంతో మహిళలు విశాఖపట్నం, తిరుపతి, హైదరాబాద్, రాయలసీమ ప్రాంతాలకు కూడా ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించవచ్చు. ఆర్టీసీ బస్సుల్లో ఇప్పటి వరకు 15 నుంచి 20 శాతం మహిళలే ప్రయాణిస్తారు. ఇకపై ఆ ఆక్యుపెన్సీ 50 శాతం పెరుగుతుందని ఆర్టీసీ అధికారుల అంచనా. కాగా, ఎన్టీఆర్, కృష్ణా రీజియన్లలో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల ఆక్యుపెన్సీ 60 శాతం ఉంది. స్త్రీ శక్తి పథకంతో 80 శాతానికి పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

ప్రభుత్వంపై భారం ఇలా..

ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆర్టీసీ బస్సులు సగటున రోజుకు నాలుగు లక్షల కిలోమీటర్లు ప్రయాణిస్తాయి. సగటున రూ.2.10 కోట్ల ఆదాయం వస్తుంది. 50 శాతం మహిళలకు ఉచితంగా ప్రయాణం కల్పించటం వల్ల రోజుకు రూ.కోటి మేర ప్రభుత్వం భరించనుంది. నెలకు రూ.30 కోట్లు, ఏడాదికి రూ.360 కోట్ల చొప్పున ప్రభుత్వం మహిళల కోసం ఖర్చు చేయనుండగా, మిగతా 8లో..

ముువ్వన్నెల పండుగకు వేళాయె

- నేడు మచిలీపట్నంలో స్వాతంత్ర్య దినోత్సవం
- ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్

మచిలీపట్నం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ జిల్లాస్థాయి వేడుకలకు మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు మంత్రి కొల్లు రవీంద్ర జాతీయ జెండాను ఆవిష్కరించి వేడుకలను ప్రారంభిస్తారు. అనంతరం జిల్లా సమగ్ర అభివృద్ధిపై ప్రసంగిస్తారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను గురువారం ఎస్పీ ఆర్.గంగాధరరావు, రిజర్వు ఏఎస్పీ సత్యనారాయణ, మచిలీపట్నం ఆర్డీవో కె.స్వాతి, తహసీల్దార్ మధుసూదనరావు తదితరులు పరిశీలించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను తెలియజేసేలా ఆయా శాఖలకు సంబంధించిన స్టాల్స్‌ను ఇక్కడ ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు, రిజర్వు విభాగం ఏఎస్పీ సత్యనారాయణ, ఆర్డీవో స్వాతి





స్వాతంత్ర్య దినోత్సవానికి ముస్తాబైన మచిలీపట్నంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్

సైబర్ నేరగాళ్ల వలలో ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్

10

జగన్ జైలుకు వెళ్లడం ఖాయం

- ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు

8

ఏపీ హెచ్‌ఎంఈఎల్ ప్రపంచంతో పోటీ పడాలి

- సింగరేణి అనుబంధ సంస్థను సందర్శించిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

8



ఈలప్రోలులో మునకేసిన వరి పొలాలు

సాగు వర్షార్పణం!

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలను నిలువునా ముంచెత్తాయి. రెండ్రోజుల వర్షానికి తోడు పాలేరు, మున్నేరు, వైరా, కట్టలేరు వంటి ఉప నదుల నుంచి వరద పోటెత్తుతోంది. ఫలితంగా జిల్లాలో వేలాది ఎకరాల పంటలు ముంపునకు గురయ్యాయి.

- భారీ వర్షాలతో పంటలను ముంచెత్తిన వరద
- పొంగిన వాగులు.. వరినాట్లు, ఉద్యాన పంటలు మునక
- ఇంకా ముంపులోనే వేలాది ఎకరాల్లో పంట పొలాలు
- పత్తి, పెసర, మొక్కజొన్న, మిరప పంటలకు తీవ్ర నష్టం

(ఆంధ్రజ్యోతి,ఇబ్రహీంపట్నం/ జగ్గయ్యపేటరూరల్/ కంచికచర్ల/తిరువూరు)



ఇబ్రహీంపట్నం మండలం జూపూడి వద్ద చెరువును తలపిస్తున్న వరిపొలాలు

జిల్లాలోనే అత్యధికంగా ఇబ్రహీంపట్నం మండలలో 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఏనుగు గడ్డ వాగు ఉప్పొంగింది. కృష్ణానదికి వరద రావడంతో ఏటి పట్టు గ్రామాల్లో వేలాది ఎకరాలో వరి పొలాలు ముంపుబారిన పడ్డాయి. దాములూరు, చిలుకూరు, దొనబండ, కొటికలపూడి, మూలపాడు, జూపూడి, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లోని వేల ఎకరాల్లో వరి నాట్లు వరద నీటిలో నానుతున్నాయి. తుమ్మలపాలెం, గుంటుపల్లి, ఈలప్రోలు గ్రామాలతో పాటు విజయవాడ రూరల్ మండలం పైడూరుపాడు, రాయనపాడు, కొత్తూరు తాడేపల్లి తదితర ప్రాంతాల్లో వరినాట్లు ముంపుబారిన పడ్డాయి. జి.కొండూరు మండలంలోని వెలగలేరు, కవులూరు పినపాక గ్రామాల పరిధిలోని పల్లపు ప్రాంతాల్లోని మాగాణి వరద నీటిలో చిక్కుకుంది. మైలవరం నియోజకవర్గంలో ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, విజయవాడ రూరల్ మండలాల్లోని పల్లపు ప్రాంతాల్లో వరినాట్లు ముంపు బారిన పడ్డాయి.



వీరులపాడు మండలం జగన్నాథపురం వద్ద మాడిపోయిన పత్తి చేను

పెసరపంటకు తీవ్ర నష్టం

జిల్లాలో ఈ ఏడాది మెట్ట ప్రాంతంలో రైతులు తొలకరిలో దాదాపుగా 10 వేల ఎకరాలలో పెసర పంటను సాగుచేశారు. పల్లాకు తెగులు సోకి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. సగం దిగుబడి అయినా చేతికి దక్కుతుందని రైతులు ఆశించారు. అక్కడక్కడ కోతలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కురిసిన భారీ వర్షాల వల్ల మిగిలిన పంట కూడా నాశనమైంది. వర్షంతో కోతకు వచ్చిన కాయలు నిలువునా దెబ్బతిన్నాయని రైతులు పేర్కొంటున్నారు. చేతికి అందాల్సిన పంట వర్షార్పణం కావంతో రైతులు అల్లాడుతున్నారు. నామమాత్రంగా కూడా దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించటం లేదు. పంట నష్టం వాస్తవంగా ఏ మేరకు జరిగిందన్నది రెండు రోజులు గడిస్తే తెలుస్తోంది. ఎకరం కౌలు రూ. 15 వేలు, సాగుకు పెట్టుబడి రూ. 10 వేలు, మొత్తం ఎకరానికి రూ. 25వేల వరకు నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు.

మాడిపోయిన పంటలు

భారీ వర్షాలతో వాగులు, వంకలు ఉధృతంగా పొంగిపొర్లి వందలాది ఎకరాలలో పంటలు ముంపునకు గురయ్యాయి. మూడు రోజులుగా నీటిలో ఉండటంతో పైర్లు నల్లగా మాడిపోయాయి. కంచికచర్ల, వీరులపాడు మండలాల్లోని పెద్దాపురం, గూడెంమాధవరం, అల్లూరు, జుజ్జూరు, నరసింహారావుపాలెం, గొట్టుముక్కల, చెన్నారావుపాలెం, పరిటాల తదితర గ్రామాల్లో ఏనుగుగడ్డ వాగు వెంబడి వేలాది ఎకరాల్లో రైతులు పత్తి, పెసర, మొక్కజొన్న పంటలు సాగుచేశారు. భారీ వర్షాలకు వాగుకు వరద పోటెత్తడంతో రెండు వైపులా కిలోమీటరు పరిధి వరకు వరద ముంచెత్తింది. మూడురోజుల వరకు వరద తగ్గలేదు. ముంపులో ఉన్న పైర్లు నిలువునా మాడిపోయాయి. తిరిగి జీవం పోసుకునే పరిస్థితి లేదు. వందలాది ఎకరాల్లో పైర్లు చచ్చిపోవటంతో రైతులకు తీరని నష్టం మిగిలింది.

జగ్గయ్యపేటలో నీట మునిగిన పొలాలు

జగ్గయ్యపేట మండల పరిధిలో చిల్లకల్లు ఊర చెరువుకు గండి పడటంతో వరదనీరు దిగువన ఉన్న వరిపొలాలు ముంపునకు గురవుతున్నాయి. షేర్ మహమ్మద్ పేట ఊర చెరువుకు దిగువనున్న వరి పొలాలు నీట మునిగాయి. కె.అగ్రహారం ముత్యాల గ్రామాలలో ఐదు ఎకరాల్లో మిరప, ఐదు ఎకరాల్లో కూరగాయల పంటలు నీటమునిగాయి. బోదవాడ వేదాద్రి రావిరాల తదితర గ్రామాల్లో స్వల్పంగా పంటలు నీటమునిగాయి. మండల పరిధిలోని వరి 530 ఎకరాలు, పెసర 30 ఎకరాలు, మిరప ఐదు ఎకరాలు, కూరగాయల పంట ఐదు ఎకరాల్లో నీట మునిగినట్టు వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు తెలిపారు. వరద ప్రభావం తగ్గితే పూర్తిస్థాయిలో ఎన్యూమరేషన్ చేసే అవకాశముంటుందని, ప్రస్తుతానికి ప్రాథమిక సమాచారం మేరకు వివరాలు తెలుపుతున్నట్టు అధికారులు వెల్లడించారు.



పల్లాకు తెగులు, వర్షాలకు దెబ్బతిన్న పెసర పంట



అనాసాగరం-శనగపాడు రోడ్డులో పారుతున్న కూచివాగు



వినగడప కట్లేరు డైవర్షన్ రహదారిపై ప్రవహిస్తున్న వరద

పొంగి పొర్లుతున్న వాగులు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో మండలంలో కురుస్తున్న వర్షం గురువారం తెరపిచ్చినప్పటికీ ఎగువ నుంచి వరద భారీగా వస్తుండటంతో గ్రామాల్లోని వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల గ్రామాల్లో రహదారులపై వరదనీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు స్తంభించాయి.



పెండ్యాల కాజ్‌వే వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మునేరు

నందిగామ రూరల్ : అనాసాగరం-శనగపాడు రోడ్డులోని కూచివాగు, చందాపురం గ్రామ సమీపంలోని నల్ల వాగు పొంగి పొర్లుతుండటంతో గ్రామాలకు రాకపోకలను నిలిపివేశారు. మాగల్లు గ్రామంలో గోడ కూలి దంతాల వీరభద్రంకు



సోమవరం-రుద్రవరం రోడ్డులో పడిన గొయ్యి

చెందిన కోళ్లఫారం కూలిపోవటంతో 70 కోళ్ల మృతి చెందాయి. సోమవరం-రుద్రవరం వెళ్లే రహదారిపై పడిన గొయ్యిని అధికారులు, గ్రామ నాయకులు పూడ్చారు. తొర్రగుడిపాడు, కొణతమాత్మకూరు, దాములూరు గ్రామాలలోని పంట పొలాలు నీట మునగటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉధృతంగా మునేరు, వైరా కట్లేరు - ఏనుగుగడ్డ వాగులు

వత్సవాయి/వీరులపాడు : ఎగువ నుంచి వస్తున్న వరద వల్ల మునేరులో పోలంపల్లి ఆనకట్ట వద్ద 8.8 అడుగుల ఎత్తున పొంగి పొర్లుతోంది. లింగాల కాజ్‌వే వద్ద 1.5 అడుగుల్లో వరద నీరు ప్రవహిస్తోంది. ఆల్లూరిపాడు వద్ద మునేటి కాలువ పొంగి ఇళ్లల్లోకి నీరుచేరింది. భీమవరంలో ఇసుక వాగు పొంగి నీరు ఇళ్లను చుట్టుముట్టాయి. మునేరు పరిసరాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు, పోలీసులు బందోబస్తు చేశారు. మునేరు వరదను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కట్లేరు వాగు ఉధృతితో దొడ్డదేవరపాడు-వీరులపాడు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పల్లంపల్లి వద్ద వైరా కట్లేరు బ్రిడ్జ్ పైన ఐదు నుంచి ఆరడుగుల మేర ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏనుగుగడ్డ వాగు ఉధృతికి పెద్దాపురం - గూడెంమాధవరం గ్రామాల మధ్య రాకపోకలు నిలిపివేశారు. చెన్నారావుపాలెం వద్ద చప్టాకు వేసిన మట్టి కొట్టుకుపోయింది. రైతులు పంట పొలాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఏనుగుగడ్డ వరదతో మెట్ట పంటలు పూర్తిగా మునిగిపోయాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా కట్లేరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

జగ్గయ్యపేట: జగ్గయ్యపేటలో వర్షాలకు వాగులు, వంకలు పొంగటంతో పల్లపు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. కాకానినగర్, డాంగేనగర్, టెలిఫోన్ కాలని, దుర్గాపురం, ఆర్టీసీ కాలనీ, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో 5 నుంచి 10 అడుగుల ఎత్తున నీరు ప్రవహించింది. ఊరచెరువు కట్ట కొట్టించటంతో వరదనీరు కిందికి వెళ్లిపోయింది. ఆర్టీసీ కాలనీ-కాకానినగర్‌లను కలిపే బ్రిడ్జి వద్ద రోడ్డు కోసుకుపోయింది. జగ్గయ్యపేట-ముక్త్యాల రోడ్డులో డంపింగ్ యార్డు వద్ద రోడ్డుకు కోతకు గురైంది. పాలేటిపై అగ్రహారం బ్రిడ్జిపై రాకపోకలు స్తంభించాయి. గురువారం ఉదయానికి వరద శాంతించటంతో పరిస్థితి మెరుగైంది. జగ్గయ్యపేటలో 176.6 మి.మీలు, వత్సవాయి లో 102.8 మి.మిలు, పెనుగంచిప్రోలులో 165.2 మి.మిలు వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు.



జగ్గయ్యపేటలో డంపింగ్‌యార్డు వద్ద వరదకు కొట్టుకుపోయిన ముక్త్యాల రోడ్డు

వరద ముంపులో చిక్కుకున్న కుటుంబాలను రక్షించిన ఫైర్ సిబ్బంది



వరద నుంచి మహిళను రక్షిస్తున్న ఫైర్ సిబ్బంది


పట్టణంలో సత్యనారాయణపురం, బీసీ హాస్టల్ ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి వరద నీటిలో చిక్కుకుపోయిన రెండు కుటుంబాలను ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చొరవతో అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. రాంబంటు తోట సమీపంలో వాగు పొంగటంతో ఇంట్లోకి వరద నీరు రావటంతో గోనెల వెంకటేశ్వర్లు (45), రాజ్యలక్ష్మి (35), ఉమామహేశ్వరి (18)లను ఫైర్ సిబ్బంది, తహసీల్దార్ మనోహర్, జగ్గయ్యపేట సీఐ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు తాళ్ల సహాయంతో వారిని సురక్షితంగా తీసుకువచ్చారు. బీసీ హాస్టల్ వద్ద ఆప్సారి రామకృష్ణ (55), వెంకాయమ్మ(70), ఈశ్వరి (20)లను ఫైర్ సిబ్బంది రక్షించారు.



కొండవీటి వాగును పరిశీలిస్తున్న అధికారులు

కొండవీటి వాగులో గుర్రపుడెక్క తొలగింపు

విజయవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కొండవీటి వాగులో వరద ప్రవాహానికి ఆటంకం లేకుండా అధికారులు గుర్రపుడెక్కను తొలగించే పనులు చేపట్టారు. గురువారం ఏడీసీ చైర్‌పర్సన్, ఎండీ డి.లక్ష్మీపార్థసారథి రాజధాని అమరావతిలో పర్యటించారు. ఈ సందర్భంగా కొండవీటి వాగులో వరదనీటి ప్రవాహానికి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజీ వద్ద కొండవీటి వాగు పంపింగ్ స్టేషన్ వద్ద నీటి ప్రవాహం పరిశీలించారు. కృష్ణాయపాలెం, కురగల్లు వద్ద గుర్రపుడెక్క తొలగింపు పనులను పరిశీలించి అధికారలకు సూచనలు చేశారు. పై నుంచి వచ్చే నీరు కృష్ణానదిలోకి కలిసేందుకు గుర్రపుడెక్క ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



జగ్గయ్యపేట-ముక్త్యాల వరదనీటిలో చేపలు పడుతున్న ప్రజలు

వరద నీటిలో చేపల వేట

జగ్గయ్యపేట రూరల్ : వరదలు కొందరికి ఆదాయ మార్గాలుగా మారాయి. చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట, జగ్గయ్యపేట ఊర చెరువుల నుంచి భారీగా వరద నీరు వస్తుండటంతో చెరువుల్లోని చేపలు నీటి ప్రవాహానికి రహదారులు, పంట పొలాల్లోకి రావటంతో వలలు, కర్రలతో పట్టుకుని సొమ్ము చేసుకుంటున్నారు. వరదలతో పంటలు దెబ్బతినగా మరోవైపు చేపల పట్టేందుకు పెద్ద ఎత్తున ప్రజలు వచ్చి పంటలను నాశనం చేశారని రైతులు వాపోతున్నారు.

మునేటిలో పడి గుంటూరు జిల్లా వాసి మృతి

పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మునేటి వద్ద స్నానం కోసం వెళ్లి గుంటూరు జిల్లా ఆరేపల్లి మండలంలోని వాకావారిపాలెంకు చెందిన వ్యక్తి గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున తెలిపిన సమాచారం మేరకు.. వాకావారిపాలెంకు చెందిన వాకా శ్రీనివాసరావు (55) తిరుపతమ్మ అమ్మవారి దర్శనం కోసం నాలుగు రోజుల క్రితం పెనుగంచిప్రోలు వచ్చాడు. గురువారం తెల్లవారుజామున స్నానం కోసం దిగిన శ్రీనివాసరావు మునేటిలో పడి మృతి చెందాడు. విషయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున సిబ్బందితో మృతదేహాన్ని బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శ్రీనివాసరావు మృతదేహానికి జగ్గయ్యపేట ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఏపీహెచ్‌ఎంఈఎల్ ప్రపంచంతో పోటీపడాలి

- సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్‌ఎంఈఎల్‌ను సందర్శించిన తెలంగాణ డిప్యూటీ సీఎం



సంస్థ ఉద్యోగులతో తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

విజయవాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజినీరింగ్ లిమిటెడ్(ఏపీహెచ్ఎంఈఎల్) ఎదగాలని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క అన్నారు. విజయవాడకు సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్‌ఎంఈఎల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడిభాగాల తయారీ, పాత విడిభాగాలను మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజినీరింగ్ సంస్థలకు ఏపీహెచ్‌ఎంఈఎల్ కన్నా మంచి మిషనరీ, మానవ వనరులు లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సంస్థలో పని చేసే అధికారులు, కార్మికులకు నిబద్ధత, ఏదైనా చేయగలగాలనే తపన ఉంటే ప్రపంచంతో పోటీపడగలమని వారిని ఉత్సాహపరిచారు. సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీని నియమిస్తామని, వారు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా సంస్థ అభివృద్ధికి ఏం చేయాలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అధికారులు, సిబ్బంది ఎంత బాగా పనిచేస్తే అంత బాగా లాభాలు సాధించడంతో పాటు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు, రాష్ట్ర ప్రగతికి దోహదపడవచ్చని పేర్కొన్నారు. సంస్థలో ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు యంత్రాలకు ఓవరాలింగ్ చేసి రంగులు వేయాలని ఆయన ఆదేశించారు. సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలన్నారు. కార్మికుల శ్రమ, ఉన్నత ఆలోచనలతోనే పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని భట్టి తెలిపారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్‌కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మత్తు వరకే పరిమితం కాకుండా భవిష్యత్తులో రాష్ట్రం, దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకుని బెల్(బీహెచ్ఈఎల్) మాదిరిగా పనిచేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. థర్మల్ పవర్‌స్టేషన్స్‌కు అవసరమైన యంత్రాలు అందించడంతో పాటు మరమ్మతు చేస్తుందని, సంస్థను భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం అన్నారు.

లిక్కర్ కేసులో.. జగన్ జైలుకు వెళ్లడం ఖాయం

- ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు



వన్‌టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : లిక్కర్ కేసులో జగన్ జైలుకు వెళ్లటం ఖాయమని, ఆయన ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ మాజీ చైర్మన్ గోనె ప్రకాశరావు అన్నారు. గురువారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పులివెందులలో జరిగిన ఉప ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలుపొందారని, వైసీపీ అభ్యర్థులు డిపాజిట్ కూడా దక్కించుకోలేదన్నారు. జగన్ అండ్ కో చేస్తున్న ప్రచారం మేరకు ఎన్నికలను రద్దు చేసే అవకాశం లేదన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలపై వైసీపీ ఎమ్మెల్యే వైఎస్ జగన్, ఎంపీ అవినాష్ రెడ్డి, మాజీ మంత్రి అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష హోదా దక్కని జగన్ పులివెందుల ఉప ఎన్నికలపై అవాకులు, చవాకులు మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. దేశంలో సూట్‌కేసు కంపెనీలు పెట్టి దోచుకున్న ముఖ్యమంత్రులు, వారి తనయులు చాలా మంది కటకటాలు లెక్కపెట్టారని, అదే తరహాలో జగన్ కూడా లిక్కర్ కేసులో జైలుకు వెళతాడని జోస్యం చెప్పారు. తాడేపల్లి ప్యాలెస్‌లో తనిఖీలు చేస్తే కొన్ని వందల కోట్ల విలువ చేసే బంగారం, డబ్బులు దొరుకుతాయని తెలిపారు. ఆ దిశగా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. లిక్కర్ కేసుల్లో అరెస్ట్ అయిన అధికారులు, వైసీపీ నాయకులను జైలుకు వెళ్లి జగన్ ఎందుకు కలుస్తున్నాడో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. లిక్కర్ కేసుల్లో జగన్‌ను నమ్ముకున్న చాలా మంది జైలు పాలయ్యారని తెలిపారు. జగన్ చంద్రబాబును నరకానికి పోతాడని శాపనార్థాలు పెట్టటం భారతదేశ రాజకీయ చరిత్రలో తాను ఎప్పుడూ చూడలేదన్నారు. ఇటువంటి రాజకీయ చరిత్ర ఉన్న వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

నాగుల్‌మీరాకు ఎమ్మెల్సీ ఇవ్వాలి

గాంధీనగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నేత, రాష్ట్రంలోని నూర్‌బాషా సామాజికవర్గానికి పెద్దదిక్కు కె.నాగుల్‌మీరాకు ఎమ్మెల్సీ పదవిని కేటాయించి గౌరవించాలని నూర్‌బాషా సంక్షేమసంఘం నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన్ను కేవలం ఒక కులానికి మాత్రమే పరిమితం చేయడం తగదన్నారు. నగరంలోని సంఘం కార్యాలయంలో గురువారం ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. నాగుల్‌మీరా స్థాయికి తగిన పదవిని కేటాయించాలని డిమాండ్ చేశారు. నూర్‌బాషా సంక్షేమ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు షేక్ ఖాజా రహీంతుల్లా, కాశీం షరీఫ్, యూత్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

- మంత్రి పార్థసారథి

గాంధీనగర్ : జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలపై సీఎం చంద్రబాబుతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, ఈనెల30లోగా నూతన అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ నేతలు గురువారం సచివాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ఆయన ఏపీజేఎఫ్ నేతలతో చర్చించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పి.శివరాజేష్ నేతృత్వంలో మంత్రిని కలిసిన వారిలో ఏపీజేఎఫ్ నేతలు తదితరులు ఉన్నారు.

ముంపు భయం

(7వ పేజీ తరువాయి)

పెనమలూరు మండలాల్లోని లంక గ్రామాల్లో సాగు చేసిన ఉద్యాన పంటలు, కూరగాయల తోటలు నీటమునిగాయి. లేత తోటలు దెబ్బతింటాయని రైతులు భయపడుతున్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండండి : ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ

కృష్ణానది పరివాహక ప్రాంతాల నుంచి ప్రకాశం బ్యారేజీకి వరద పెద్ద ఎత్తున వచ్చి చేరుతుండటంతో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలిశర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో ఆమె టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. రాత్రికి ప్రకాశం బ్యారేజీ నుంచి ఆరు లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలే అవకాశం ఉన్నందున నదీ తీర ప్రాంత మండలాల్లోని 62 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. పెనమలూరు, తోట్లవల్లూరు, చల్లపల్లి, మోపిదేవి మండలాల పరిధి లంకల్లోని బాలింతలు, గర్భిణులు, చిన్నారులు, వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. ఆయా కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, మందులు అందుబాటులో ఉంచి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పడవలను సిద్ధంగా ఉంచాలన్నారు. కరకట్టకు ఎక్కడైనా గండ్లుపడే ప్రమాదం ఉంటే ముందస్తుగా ఇసుక మూటలను ఉంచాలని తెలిపారు. రహదారులు దెబ్బతింటే యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆయా శాఖల అధికారులు వేర్వేరు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. నాగాయలంక మండలం గొల్లమంద- ఎదురుమొండి దీవుల మధ్య వరద నీటి కారణంగా రహదారి దెబ్బతింటోందని, వెంటనే ఈ రహదారికి మరమ్మతులు చేయాలన్నారు. అవనిగడ్డ మండలం యడ్లంక గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజల రాకపోకల కోసం పడవలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పెనమలూరులో 16, అవనిగడ్డలో 20 పడవలను సిద్ధంగా ఉంచామని మత్స్యశాఖ జేడీ నాగరాజు ఈ సందర్భంగా తెలిపారు.

నిలకడగా బుడమేరు వరద

బుడమేరు వరద నిలకడగా ఉందని గుడివాడ ఆర్డీవో సుబ్రహ్మణ్యం ఇన్‌చార్జి కలెక్టర్‌కు టెలీకాన్ఫరెన్స్‌లో వివరించారు. బుడమేరుకు ఏడు వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కేసరపల్లి, నందివాడ, పుట్టగుంట, ఉంగుటూరు మండలం ఇందుపల్లి వంతెనల వద్ద బుడమేరు ఉధృతి అధికంగా ఉందని చెప్పారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని తెలిపారు. ఈ ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

ప్రగతి పథంలో.. ఉచిత ప్రయాణం

(7వ పేజీ తరువాయి)

ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 780 బస్సులు ఉన్నాయి. ఇందులో 454 బస్సుల్లో స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తున్నారు. వీటిలో పల్లెవెలుగు 100, అల్ట్రా పల్లెవెలుగు 27, సిటీ ఆర్డినరీ 179, మెట్రో ఎక్స్‌ప్రెస్ 100, ఎక్స్‌ప్రెస్ బస్సులు 48లో ఉచిత ప్రయాణం అమల్లో ఉంటుంది.

- కృష్ణా జిల్లాలో మొత్తం 411 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. 309 బస్సుల్లో స్త్రీ శక్తి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో పల్లెవెలుగు బస్సులు 160, అల్ట్రా పల్లెవెలుగు 26, సిటీ ఆర్డినరీ బస్సులు 75, ఎక్స్‌ప్రెస్ 37, మెట్రో ఎక్స్‌ప్రెస్ 11లో ఉచిత పథకాన్ని అమలు చేస్తున్నారు.

కండక్టర్లకు శిక్షణ

మహిళల ఉచిత బస్సు పథకాన్ని అమలు చేయటానికి వీలుగా ఇప్పటికే కండక్టర్లకు శిక్షణ కల్పించారు. టికెట్ ఇష్యూయింగ్ మెషీన్స్ (టిమ్)లో మహిళలకు జీరో ఫేర్ టికెట్ రావటానికి వీలుగా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేశారు. ప్రతి మహిళకు తప్పనిసరిగా టికెట్ ఇస్తారు. ఎలాంటి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదు. బస్సు ఎక్కేముందు ఆధార్ కార్డు లేదా ఓటరు కార్డు, మరేదైనా గుర్తింపు కార్డును చూపించాలి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

మల్లవల్లి మహిషమ్మ ఆలయంలో చోరీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : మల్లవల్లి - ఈదులగూడెం రోడ్డులోని మహిషమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఆలయ గ్రిల్స్ గడిని బలమైన ఆయుధంతో వంచి బీరువా తాళాలను బద్దలుకొట్టి అందులో అమ్మవారికి సమర్పించి నూతనవస్త్రాలు, హుండీని పగలగొట్టి సుమారు రూ.2వేలకు పైగా నగదును దొంగిలించినట్లు తెలిపారు. ఇటీవల అమ్మవారికి ఆషాఢసారె సమర్పించడంతో హుండీ ఆదాయం రూ.10వేలకు పైగా ఉండవచ్చని, ప్రతి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించేందుకు భక్తులు సమర్పించిన 23 చీరలు బీరువాలో ఉన్నట్టు ఆలయ నిర్వాహకులు చిన్నాల ప్రసాద్ తెలిపారు. ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గడి విరగ్గొట్టిన ఆలయ ద్వారం



కలవపాములలో పీఏసీఎస్ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేస్తున్న కలపాల మల్లేశ్వరరావు

కలవపాముల పీఏసీఎస్ చైర్మన్‌గా

'కలపాల' ప్రమాణస్వీకారం

ఉయ్యూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కలవపాముల ప్రాథమిక వ్యవ సాయ సహకార సంఘం అధ్యక్షుడిగా కలపాల మల్లేశ్వరావు, డైరెక్టర్లుగా పాగోలు మురళి. ఎన్.సుబ్బారావు గురువారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు, రైతుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా నాయకులు కష్టపడి పనిచేయాలన్నా రు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పీఏసీఎస్‌లకు నూతనంగా నియమితులైై పాలకవర్గం రైతుల సంక్షేమం, అభివృద్ధికి పాటు పడాలన్నారు. జబర్లపూడి సర్పంచ్ ఎస్.శేషవరప్రసాద్, ఉయ్యూరు చైర్మన్ వి.సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్, డైరెక్టర్ పామర్తి శ్రీనివాసరావు, ఆర్.వరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా సైకిల్ ర్యాలీ

» సిద్ధార్థ డీమ్స్ వర్సిటీ విద్యార్థులు హల్‌చల్

కానూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిం చారు. దేశ భక్తిని, జాతీయ ఐక్యతను చాటిచెప్పే సైకిల్ ర్యాలీలో విద్యార్థులతోపాటు వర్సిటీ వైస్‌చాన్సలర్ పరుచూరి వెంకటేశ్వరరావు, ప్రో. వీసీ ఏవీ రత్న ప్రసాద్, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శివరాం ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎ. వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్రకు ప్రజలు సహకరించాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని ఎంపీడీవో త్రినాథ్ కోరారు. రంగన్న గూడెంలో చెత్త సేకరణను గురువారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. తడి, పొడిచెత్త వేర్వేరుగా సేక రించాలని సారిశుధ్య కార్మికులకు సూచించారు. దోమల వల్ల వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ఇంటి చుట్టు పక్కల చెత్త, వర్షపునీరు నిలువలేకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజలపైనే ఉందన్నారు.



చెత్త సేకరణను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ త్రినాథ్

● గ్రామసభ ద్వారానే పీ4 లబ్ధిదారుల ఎంపిక

పీ4 లబ్ధిదారులను గ్రామసభ ద్వారా పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎంపీడీవో త్రినాథ్ సూచించారు. సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ సభ్యురాలు పుసులూరి లక్ష్మీనారాయణ గురువారం సమావేశం నిర్వహించారు.



కలవపాముల

సర్వేయర్ సస్పెన్షన్

ఉయ్యూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కలవపాముల గ్రామసచివాలయ సర్వేయర్ వర్రె అరుణ్‌కుమార్‌ను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. ఇటీవల తన భార్యమరణానికి అరుణ్‌కుమార్ కారకుడుగా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో ఆమేర అతనిని సస్పెండ్ చేస్తూ జిల్లా సర్వే అధికారి ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

మాజీ మంత్రి పేర్నికి

మతి భ్రమించింది : టీడీపీ

కంకిపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో ప్రతిపక్ష హోదాకూడా లేని వైసీపీ ఓటమితో వైసీపీ నాయకులకు మతి భ్రమించిదని కంకిపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు దేవినేని రాజా అన్నారు. విలేకర్లతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పులివెందలలో ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. మంత్రి పేర్నినాని ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని మండి పడ్డారు. సమావేశంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, జిల్లా కార్యదర్శి సుధాకర్, షేక్ షకార్ తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు

» కాజ్‌వే పైనుంచి రెండడుగులమేర పారుతున్న వరద
» తేలప్రోలు-ఉయ్యూరు ప్రధాన రహదారిపై రాకపోకలు బంద్
» నీటిప్రవాహానికి తీవ్ర అడ్డంకిగా మారిన గుర్రపుడెక్క, తూడు
» యుద్ధప్రాతిపదికన తూడు, డెక్క తొలగింపు పనులు
» కొనసాగుతున్న వరద నీటి ప్రవాహం

ఉంగుటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులపై పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వాగులు, కాలువలు ఉప్పొంగి ప్రవహించడంతో వరిపొలాలు నీట మునిగాయి. బుడమేరు, పిల్లికోడు, వన్నేరు వాగులు ఉగ్రరూపం దాల్చడంతో కాల్వలను ఆనుకుని వున్న వరిపొలాలు ముంపునకు గురయ్యాయి.

తేలప్రోలు-ఉయ్యూరు రహదారిపై రాకపోకలు బంద్

తేలప్రోలు-ఉయ్యూరు ప్రధాన రహదారిపై ఉంగుటూరు వద్ద బుడమేరు కాజ్‌వే వంతెనపై రెండు అడుగుల మేర వరదనీరు పొంగి ప్రవహిస్తుండటంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపుడెక్క, తూడు, ఇతర వ్యర్థాలు వరదనీటి ప్రవాహానికి అడ్డంకిగా మారడంతోనీరు వంతెనపైకి చేరింది. గురువారం ఉదయంనుంచి వరద క్రమేణా పెరుగుతుండటంతో అప్రమత్తమైన అధికారులు, పోలీసులు ఆ మార్గంలో వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. ఎంపీడీవో ఇ.సత్యకుమార్, తహసీల్దార్ జె.వి మలకుమారి, ఏవో గద్దె రమేష్, డ్రైనేజీ ఏఈఈ ఉదయ్‌కిరణ్, ఎస్సై యు.గోవిందు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

మద్దూరు పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కంకిపాడు : మండలంలోని మద్దూరు, కాసరనేని వారి పాలెం పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల పరిషత్ అధికారి అనూష అన్నారు. కృష్ణా నది ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతిని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా మద్దూరు నదీ పరివాహక ప్రాంతంలో వరద ఉధృతంగా ప్రవహిస్తుందన్నారు. పంచాయతీ అధికారులు రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవో చింతా కిరణ్‌కుమార్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎంపీడీవో అనూష



ఉంగుటూరు వద్ద బుడమేరు కాజ్‌వే వంతెనపైనుంచి పారుతున్న వరద

నీట మునిగిన శివాలయం

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎగువ నుంచి వస్తున్న వరద కారణంగా కాసరనేనివారి పాలెంలోని కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని శ్రీపార్వతీ సమేత పరమేశ్వరాలయం (శివాలయం) నీట మునిగింది. వరద పరిస్థితి ఇదే విధంగా ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ఉప్పలూరు బుడమేరును పరిశీలించిన డీఎస్పీ

బుడమేరు వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఉప్పలూరు, కేసరపల్లి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉప్పలూరు బుడమేరు ప్రవహిస్తున్న వరద నీరును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఎస్సైలు డి. సందీప్, తాతాచార్యులు పాల్గొన్నారు.

142 హెక్టార్లలో వరి పంట ముంపు



ఉయ్యూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల పరిధిలో 142 హెక్టార్లలో వరిపైరు నీట మునిగినట్టు మండల వ్యవసాయ అధికారి బి.నిస్సీగ్రేస్ తెలిపారు. ముదునూరు, కాటూరు, వీరవల్లి, కడవకొల్లు గ్రామాల పొలాల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. కంకిపాడు, పెనమలూరు గ్రామాలనుంచి, వచ్చిన వర్షం నీరు, చంద్రయ్య కోడు మురుగు కాల్వ పూడిక తీతకు నోచుకోలేదు. దీంతో పొట్లపాడు, కడవకొల్లు, గండిగుంట, వీరవల్లి పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కాసరనేనివారి పాలెంలో నీట మునిగిన శివాలయం





యూరియా అమ్మకాల అవకతవకలపై విచారణ



గండిగుంట పీఏసీఎస్ గోదాములో స్టాకు తనిఖీ చేస్తున్న డీటీ ప్రధాన్, ఏవో నిస్సీగ్రేస్

ఉయ్యూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గండిగుంట, బొళ్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో యూరియా, కాంప్లెక్స్ ఎరువుల అమ్మకాల్లో అవకతవకలు జరిగినట్టు జిల్లా అధికారులకు వచ్చిన ఫిర్యాదులమేర వ్యవసాయ, సివిల్‌సప్లై అధికారులు విచారణ చేపట్టారు. గన్నవరం ఏడీఏ సునీల్, మండల వ్యవసాయ అధికారి నిస్సీగ్రేస్, డీటీ ప్రధాన్, రెవెన్యూ అధికారులు బుధవారం సంఘంలో రికార్డులు, బిల్లు పుస్తకాలు తనిఖీ చేయగా పట్టాదారు పాస్‌పుస్తకం లేకుండా ఆధార్ కార్డుతో కొందరికి యూరియా విక్రయించినట్టు తేలడంతో సంఘం కార్యదర్శి సుబ్రహ్మణ్యంపై క్రమశిక్షణ చర్యలకు జిల్లా అధికారులకు నివేదిక పంపినట్లు ఏడీఏ తెలిపారు. గండిగుంట పీఏసీఎస్‌లో గురువారం డీటీ ప్రధాన్, ఏవో నిస్సీగ్రేస్, ఇతర అధికారులు రికార్డులు, బిల్లుపుస్తకాలు తనిఖీచేసి గోదాములో ఉన్న స్టాకుతో సరిచూడగా 76 బస్తాల యూరియా, 39 బస్తాల కాంప్లెక్స్ ఎరువు, రికార్డుల ప్రకారం లేకపోవడం, ఎవరికి విక్రయించారో బిల్లు పుస్తకంలో చూపకపోవడంతో గోదాము కీపర్ బుజ్జి, సంఘం ఇంచార్జి కార్యదర్శి రమాదేవిపై 6ఏ కేసు నమోదుచేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు తెలిపారు.

రైతుల ఆగ్రహం

యూరియా విక్రయాల్లో అవకతవలకు వ్యవసాయ అధికారులే కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ-క్రాప్ చేసిన పంటలు, రైతుల జాబితా సహకార సంఘాలకు తెలపలేదు. ఏరైతు ఎన్ని ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగుచేస్తున్నారో తెలియక ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి. ఎరువుల పంపిణీ గురించి వ్యవసాయ అధికారుల నుంచి పూర్తి సమాచారం లేకపోవడం, నాయకుల ఒత్తిడిలతో బలిపశువులం అవుతున్నామని సంఘాల ఉద్యోగులు, సిబ్బంది వాపోతున్నారు.





అభివృద్ధి, సంక్షేమం

కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే బోడె

కంకిపాడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి, సంక్షేమం కూటమి లక్ష్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కుందేరు వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారంలో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై ప్రధాన దృష్టి పెట్టిందన్నారు. పదవులు పొందిన వారు పదవులను అలంకారప్రాయంగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, పక్షపాత దోరణి లేకుండా చిన్న, సన్న కారు రైతులకు అందుబాటులో ఉండా లని కోరారు. కుందేరు పీఏసీఎస్ చైర్మన్‌గా చలసాని వెంక టేశ్వరరావు, సభ్యులుగా కలపాల వెంకటేశ్వరరావు, మందపాటి రాంబాబులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

ఎరువులు అధిక ధరలకు

విక్రయిస్తే చర్యలు తప్పవు

ఉంగుటూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీకే రైతులకు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జాలాది విమలకుమారి, మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రైవేటు ఎరువుల డీలర్ల సమావేశంలో యూరియా అమ్మకాలపై పలు సూచనలు చేశారు. మందుల దుకాణాలపై నిఘా వుంటుందని, కల్తీ ఎరువులు అమ్మినా, బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించి కృత్రిమ కొరత సృష్టించినా కఠిన చర్యలు తప్పవన్నారు. డీలర్లు తప్పనిసరిగా ధరల పట్టికను దుకాణాల వద్ద బోర్డులపై ప్రదర్శించాలని, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ బి.సూర్యకాంతి, ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, పెదఅవుటపల్లి, తేలప్రోలు, ఆత్కూరు, ఆముదాలపల్లి, ఉంగుటూరు తదితర ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు

ఉచితంగా సూర్యఘర్

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్‌ను ఎస్సీ, ఎస్టీ వర్గాలు సద్వినియోగం చేసుకోవాలని జంక్షన్ విద్యుత్ శాఖ ఏఈ రుక్మిణీకల్యాణి గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్‌లో 200 యూనిట్లులోపు విద్యుత్ వినియోగించేవారు దీనికి అర్హులని తెలిపారు. మండలంలో 800 మంది వినియోగదారులను గుర్తించినట్లు తెలిపారు. బీసీ వర్గాలకు కూడా ప్రభుత్వం అదనంగా మరో రూ.30వేలు సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు.

రైతుల అభ్యున్నతికి విశేష కృషి

గన్నవరం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతి కోసం విశేష కృషి చేస్తానని పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోట్టిపూళ్ల వీరబాబు అన్నారు. సూరంపల్లి శ్రీగాంధీ మహర్షి ప్రాథమిక సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ గురువారం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వీరబాబు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలను అందజేసి వ్యవసాయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. సర్పంచ్ ఈలప్రోలు వాసు, డైరెక్టర్‌లు రామినీడు బసవ పూర్ణయ్య, బాల నాయక్, ఎంపీటీసీ సభ్యులు గండికోట సీతయ్య, బాణవత్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ షాపులో అగ్నిప్రమాదం

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రోడ్డులో షేక్ సలీం నిర్వహిస్తున్న లారీ మెకానిక్ వర్క్ షాపులో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో రూ.75వేలు విలువ చేసే పరికరాలు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అర్ధరాత్రి సమయంలో షాపులో మంటలు రేగాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక కేంద్రం అధికారి అమరేశ్వరావు, సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

భవిష్యత్తు తరాలకు మొక్కలు నాటాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్ అన్నారు. పెరికీడులోని చింతా సీతయ్య జూనియర్ కాలేజీ ఆవరణలో విద్యార్థులతో కలిసి 50కి పైగా మొక్కలు నాటినట్లు రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివరాయల్ తెలిపారు. సభ్యులు జింకా లలిత, గొట్టాపు ప్రవీణ్‌కుమార్, సుంకర సాంబశివరాయల్, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

ఉయ్యూరు : ఉయ్యూరు రాజేంద్రనగర్‌లో అభీష్ట సిద్ధి అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

కానూరులో సుపరిపాలన తొలి అడుగు

కానూరు : కానూరులో గురువారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం జరిగింది. జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు ఏడాది కాలంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు.





దివిసీమకు వరద..అప్రమత్తం



పడవలో ఎడ్లంకకు వెళ్తున్న ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టీడీపీ నేతలు

అవనిగడ్డ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు భారీ ఎత్తున వరద నీరు విడుదల కావటంతో ప్రస్తుతం పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద ఆరు లక్షల క్యూసెక్కుల నీరు ప్రవస్తోంది. ఇరిగేషన్ శాఖ అధికారులు మాట్లాడుతూ కృష్ణానది తీరంలోని గ్రామాల ప్రజలు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వరద ప్రవాహం కొనసాగినా ఏ మాత్రం ఆందోళన చెందవద్దని తెలిపారు. గ్రామస్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

బిక్కుబిక్కుమంటున్న పాత ఎడ్లంక ప్రజలు

కృష్ణానదికి వరద పోటెత్తడంతో పాత ఎడ్లంక వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. గ్రామానికి చెందిన విద్యార్థులతోపాటు కూలీ పనులకు వెళ్లే వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీలు ఇస్తున్నారే తప్ప వం తెన నిర్మాణం చేపట్టలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఎన్నో ఏళ్లుగా ప్రజాప్రతినిధులు స్పందించి పాత ఎడ్లంక గ్రామానికి వంతెన నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అధికారుల పర్యటన

వరద ముంపునకు గురైన పాత ఎడ్లంక గ్రామాన్ని తహసీల్దార్ కె.నాగమల్లేశ్వరరావు, ఎంపీడీవో వనజ, సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్ గ్రామంలో పర్యటించారు. పలువురు గ్రామస్థులు వరద ముంపునకు గురయ్యే తమ గ్రామంలో ఉండలేమని, మరో చోట పునరావాసం కల్పించాలని కోరారు. అధికారులు మాట్లాడుతూ నది దాటే సమయంలో లైఫ్ జాకెట్లు ధరించాలని సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అవసరమైన పక్షంలో పునరావాస కేంద్రాలకు తరలిరావాలని సీఐ, ఎస్సై తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాత ఎడ్లంక గ్రామంలో పర్యటించారు. అవసరమైన పక్షంలో అవనిగడ్డ రంగ నాయకమ్మ గర్ల్స్ హైస్కూల్‌లో పునరావాసం కల్పించాలని, వరదల కారణంగా నష్టపోయిన గ్రామస్థులకు పరిహారం చెల్లించటంతోపాటు దెబ్బతిన్న పం టలకు పరిహారం వారు అధికారులను కోరారు. టీడీపీ నాయకులు పరుచూరి దుర్గా ప్రసాద్, ఘంటసాల రాజమోహనరావు, బండే రాఘవ, కొల్లూరి వాసు, మేడికొండ విజయ్, షేకర్ బాబావలి పాల్గొన్నారు.



కె.కొత్తపాలెం వద్ద గ్రామస్థులకు సూచనలు చేస్తున్న చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ

కంట్రోల్ రూంకు సమాచారం అందించాలి

మోపిదేవి : గంట గంటకు పెరుగుతూ వస్తున్న కృష్ణా నది వరద ఉధృతి కారణంగా నది తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. నదీ తీర గ్రామాలైన బొబ్బర్లంక, కె.కొత్తపాలెం గ్రామాల వద్ద గురువారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి వరద పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన పక్షంలో కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని తెలిపారు. గ్రామసర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, తెలుగు యువత రాష్ట్ర నాయకులు, పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు. నదీ తీర గ్రామాల్లో బలహీనంగా ఉన్న కృష్ణానది కరకట్ట పటిష్ఠతకు అధికారులు ఇసుక బస్తాలు సిద్ధం చేస్తున్నారు. కోసూరువారిపాలెం, ఉత్తర చిరువోలులంక, అయోధ్య వద్ద కరకట్టకుఇసుక బస్తాలు వేస్తున్నారు.



టి.కొత్తపాలెం వద్ద కరకట్టను పరిశీలిస్తున్న అధికారులు

లోతట్టు ప్రజల అప్రమత్తం

నాగాయలంక : ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీరు ప్రకాశం బ్యారేజీకి చేరటంతో అధికారులు వరద నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. దీంతో నాగాయలంక రేవుకి వరద నీరు భారీగా చేరి గురువారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏడు లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు వస్తుందని అధికారులు అంచనా వేయటంతో మండల ప్రత్యేకాధికారి ఎ.నాగరాజు, తహసీల్దార్ సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్, ఎస్సై కె.రాజేష్ తీర ప్రాంతాలు, లోతట్టు ప్రజలను అప్రమత్తం చేశారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని, పడవలను ఒడ్డుకు చేర్చాలని కోరారు. ఈనేపథ్యంలో ఏటిమొగ నుంచి ఎదురుమొండి వెళ్లే పడవలను నిలిపివేశారు. పంటును జాగ్రత్తగా నడుపుకోవాలని నిర్వాహకులకు నోటీసులు ఇచ్చి పలు సూచనలు చేశారు. బలహీనంగా ఉన్న టి.కొత్తపాలెం, ఏటిమొగ కరక ట్ట ప్రదేశాలను పరిశీలించారు. ఇసుక బస్తాలు సిద్ధం చేసుకుని కరకట్టకు చేర్చాలని ఇరిగేషన్ అధికారి పి.రవితేజను ఆదేశించారు.

పల్లపు చేలల్లోకి వరదనీరు



రాముడుపాలెం వద్ద నీటమునిగిన పసుపు

చల్లపల్లి : వరద పెరగటంతో చల్లపల్లి మండలం నడకుదురు రేవుకు పక్కనే ఉన్న పసుపు చేలల్లో నీరు చొచ్చుకువచ్చింది. నెల, రెండు నెలల వయసున్న పసుపు పిలకలు పూర్తిగా వరదనీటిలో మునిగాయి. మరికొన్ని పసుపు చేలల్లో వరదనీరు వచ్చినప్పటికీ తలలు మునగలేదు. వరద పెరిగితే మరికొన్ని చేలల్లో పసుపు నీటమునిగే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. నీటమునిగిన పసుపు మొక్క కుళ్లిపోతుందని, మళ్లీ పసుపు విత్తనం నాటుకోవాల్సిందేనని రైతులు చెబుతున్నారు. రాముడుపాలెం పుష్కర ఘాట్ వద్ద మెట్లు పూర్తిగా మునిగిపోయాయి. వరద పరిస్థితిని పరిశీలిస్తూ రైతులు కరకట్టపైకి చేరుకున్నారు.



జయపురం వద్ద చెరువును తలపిస్తున్న పంట పొలాలు

నీటిలో నానుతున్న వరి నాట్లు



వలకట్లను తొలగిస్తున్న రైతులు

అవనిగడ్డ : ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పంట పొలాలకు నీరు పెట్టి నాట్లు వేసుకున్న రైతులను మంగళవారం రాత్రి కురిసిన వర్షం నిండా ముంచింది. కేవలం రెండు గంటల పాటు కురిసిన వర్షానికే ఆరు మండలాల్లోని పొలాలు నీటమునిగాయి. డ్రెయిన్ల నిర్వహణపై అధికారులు, ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి లేకపోవటమే కారణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగాయలంక, కోడూరు మండలాల్లో దాదాపు ఆరువేల ఎకరాల్లో నాట్లు వేసిన వరి నీటిలో నానుతోంది. అవనిగడ్డలో రెండు వేల ఎకరాలు, మోపిదేవిలో మూడు వేల ఎకరాలు, చల్లపల్లిలో 1700 ఎకరాలు, ఘంటసాలలో 1000 ఎకరాలకు పైగా వరి నీటిలో నానుతూ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

డ్రెయిన్ల నిర్వహణ లోపమే

వరి నీటమునగటానికి డ్రెయిన్ల అస్తవ్యస్థ నిర్వహణే ప్రధాన కారణమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవలే డ్రెయిన్లను ఆధునీకరించేందుకు, తూడు, గు ర్రపు డెక్క తొలగింపుకు నిధులు విడుదల కాగా, పలు చోట్ల పనులను తూతూ మంత్రంగా ము గించేశారని విపక్ష ం వైసీపీ ఆరోపణలు చేస్తూ వచ్చింది. ఈ ఆరోపణలకు బలం చేకూర్చేలా దివి ప్రాంతంలోని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లోని ప్రధాన డ్రెయిన్లన్నీ ఉగ్గబట్టి నీరు సముద్రంలోకి కలిసే పరిస్థితి లేకపోవటంతో పొలాలు నీటమునిగాయి. మీడియం, మైనర్ డ్రెయిన్లపై ఇష్టారీతిన వలకట్లు ఏర్పాటు చేసినప్పటికీ అధికారులుపట్టించు కోకుండా వదిలివేయటంతో ఎక్కడ నీరు ఎక్కడే నిలిచిపోయింది. పంట పొలాలన్ని ముంపునకు గురైన తర్వాత దివి ప్రాంతంలోని రత్నకోడు మీడియం డ్రెయిన్‌పై అడ్డంకులు తొలగించేందుకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు.

జలదిగ్బంధంలో లంకగ్రామాలు

తోట్లవల్లూరు : కృష్ణానదీపాయల్లో వరద ఉధృతి పెరిగింది. ఎనిమిది లంక గ్రామాలు పాములలంక, తుమ్మల పచ్చికలంక, తోడేళ్ళ దిబ్బలంక, కాళింగదిబ్బలంక, పొట్టిదిబ్బ లంక, కనిగిరిలంక, ములకలపల్లిలంక, పిల్లివానిలంక గ్రామాలు జల దిగ్బంధంలో ఉన్నాయి. ముఖ్యమైన పనుల నిమిత్తం మాత్రమే ప్రజలు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. రెవెన్యూ అధికారులు సిబ్బందిని అప్రమత్తం చేసి లంక గ్రామాల ప్రజలతో ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారు.

శాంతించాలని కృష్ణమ్మకు పూజలు

ఇంద్రకీలాద్రి : కృష్ణానది వరదను పురస్కరించుకుని, వరద ప్రభావం నుంచి ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండాలని లోక క్షేమం కోరుతూ కనకదుర్గమ్మ తరఫున కృష్ణానదికి గురువారం ప్రత్యేక పూజలు చేసి సుమంగళ ద్రవ్యాలు సమర్పించారు. దేవస్థానం ఈవో వి.కె.శీనానాయక్ దంపతులు నదీ మతల్లికి దుర్గామల్లేశ్వర దేవస్థానం తరఫున ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పసుపు, కుంకుమ, గాజులు, వస్త్రాలు దుర్గమ్మ నుంచి కృష్ణమ్మకు సమర్పించారు. ఆలయ అర్చకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



జనసురక్ష మెగా శిబిరంలో మాట్లాడుతున్న ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ లక్ష్మీకాంతరావు

జన సురక్ష పథకాలతో ప్రజలకు భద్రత

విజయవాడ రూరల్. ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జన సురక్ష పథకాలతో సామాన్య ప్రజలకు భద్రత లభిస్తుందని, పథకాలపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌బీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్ లక్ష్మీకాంతరావు అన్నారు. నున్నలోని స్వప్న ఫంక్షన్ హాల్లో గురువారం మెగా జనసురక్ష శిబిరం జరిగింది. లక్ష్మీకాంతరావు మాట్లాడుతూ బ్యాంక్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరూ కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని, కేవైసీ గడువు ముగిసిన ఖాతాదారులు రీ కేవైసీ చేయించుకోవాలన్నారు. రాష్ట్ర స్థాయి బ్యాంకర్స్ కమిటీ కన్వీనర్ సీవీఎస్ బాస్కరరావు, అటల్ పెన్షన్ యోజన ద్వారా 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ. వేయి నుంచి రూ. 5 వేల వరకు కనీస పెన్షన్ లభిస్తుందన్నారు. చందాదారుడు మరణించిన తరువాత జీవిత భాగస్వామికి అదే పెన్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పీఎం సురక్ష భీమా యోజన పథకంలో చేరిన ఖాతాదారులకు మరణించిన లేదా శాశ్వత అంగవైకల్యం సంభవించినా రూ. 2 లక్షల ప్రమాద బీమా లభిస్తుందని తెలిపారు. వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ బషీర్, జీఎం మహేన, కెనరా బ్యాంక్ జీఎం సీజే విజయలక్ష్మి, యుబీఐ రీజినల్ హెడ్ ఎంవీ తిలక్, ఎస్‌బీఐ డీజీఎం సీతాక్షిసింగ్, రీజనల్ హెడ్ రాఘవరావు, బీవోఐ జోనల్ హెడ్ బంగారు రాజు, ఎల్‌బీసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, యూబీఐ డిప్యూటీ రీజినల్ హెడ్ చందన, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



సిటీ సివిల్ కోర్టులో ఇ-సేవ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం న్యాయమూర్తులు

సిటీ సివిల్ కోర్టులో మూడు ఇ-సేవా కేంద్రాలు ప్రారంభం

విజయవాడ లీగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సిటీ సివిల్ కోర్టులో మూడు ఇ-సేవా కేంద్రాలను గురువారం ప్రారంభించారు. తొలి ఈ సేవా కేంద్రాన్ని బెజవాడ బార్ అధ్యక్షుడు ఎ.కె.భాషా, ఇతర న్యాయమూర్తులు ప్రారంభించారు. రెండో ఇ-సేవా కేంద్రాన్ని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎ.సత్యానందం, 12వ అదనపు జిల్లా జడ్జి ఎస్.సునీల్, మూడో ఇ- సేవా కేంద్రాన్ని కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి భూపాల్‌రెడ్డి ప్రారంభించారు. దావాలు, దావాకి సంబంధించిన దస్తావేజులు ఫైల్ చేసుకొనేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయి. పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ, ఎంపీ, ఎమ్మెల్యేల కోర్టు న్యాయమూర్తి ఎ.అనిత, 13వ అదనపు జిల్లా జడ్జి శేషయ్య, ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి తిరుమల వెంకటేశ్వర్లు, నాలుగవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి, ఏడవ అదనపు జిల్లా జడ్జి అబ్రహం, నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి.అంజనీ ఎస్ ఎస్ రామ ఆదిత్య రిషిక, మూడో అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి.తిరుమలరావు, ఇతర న్యాయమూర్తులు, బార్ ప్రధాన కార్యదర్శి కె.వి. రంగారావు పాల్గొన్నారు.

ఇంద్రకీలాద్రిపై పనులు వేగవంతం చేయాలి



అన్నదాన భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్, ఈవో

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వివిధ అభివృద్ధి పనులను దసరా ఉత్సవాల దృష్ట్యా వేగవంతం చేయాలని దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ దుర్గగుడి అధికారులకు సూచించారు. దసరా ఉత్సవాల ఏర్పాట్లను, నిర్మాణాల పనులను గురువారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నదాన భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. ల డ్డూ పోటు పనులను పరిశీలించి ప్రణాళికాబద్ధంగా చేయాలన్నారు. తగు సూచనలు చేశారు. ఘాట్ రోడ్డులో మరమ్మతులు వేగవంతం చేయాలన్నారు. శివాలయం మెట్ల నుంచి కనకదుర్గానగర్ ప్రవేశ ద్వారం వరకు నూతన బీటీ రోడ్డును నిర్మాణం చేయాలన్నారు. దేవదాయ శాఖ సీఈ శేఖర్, దేవస్థానం ఈఈలు కోటేశ్వరరావు, రాంబాబు, దేవస్థానం డీఈఈలు, ఏఈలు, తదితరులు ఉన్నారు. దుర్గగుడి ఈవో శీనానాయక్ దసరా ఉత్సవాల పనులను రామచంద్రమోహన్‌కు తెలియజేశారు. క్యూలు, లడ్డూ ప్రసాద విక్రయాలు, అన్నప్రసాద వితరణ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి వాటి పై ప్రత్యేక దృష్టిపెట్టినట్టు కమిషనర్‌కు ఆయన వివరించారు.

జలవనరుల సమర్థ నిర్వహణ అవశ్యం

● సాగునీటి వినియోగదారుల సంఘాల చైర్మన్ల సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జల వనరుల సమర్థ నిర్వహణ అవశ్యమని, దీనిలో సాగునీటి వినియోగదారుల సంఘాల భాగస్వామ్యం ముఖ్యమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా అన్ని జిల్లాల కలెక్టర్లు, సాగునీటి వినియోగదారుల సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్ లక్ష్మీశ, సాగునీటి సంఘాల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్ నుంచి హాజరయ్యారు. నీటి భద్రత, జల వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, నీటి నిర్వహణ సామర్థ్యం, పంటల నిర్వహణ తదితరాలపై ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. కరువు పరిస్థితులు ఎదురుకాకుండా వాన నీటి సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సాగునీటి సంఘాల సహకారంతో జిల్లాలో నీటి వనరుల సమర్థ నిర్వహణలో మంచి ఫలితాలు సాధించాల్సి ఉందన్నారు. భూగర్భ జలాల పెంపులోనూ జిల్లాను ముందు వరుసలో నిలుపుదామని పేర్కొన్నారు.ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల్లో సమీకృత నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వర్షపు నీరు నిల్వ చేసుకొనేందుకు నీటికుంటలు ఏర్పాటు చేసుకోవడం వల్ల పంటకు కావాల్సిన నీటికి ఇబ్బంది లేకుండా ఉండటంతో పాటు నేల కోతకు గురికాకుండా, పోషకాల క్రమక్షయం జరుగకుండా అడ్డుకొనేందుకు, భూగర్భ జలాలు పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. తక్కువ నీటి వినియోగంతో, అగ్రిటెక్ విధానాల సహాయంతో సాగును లాభసాటిగా చేసుకోవాలన్నారు. ఇష్టమొచ్చినట్లు రసాయన ఎరువులు వినియోగిస్తే నేలసారంతో పాటు ఆరోగ్యానికి హాని జరుగుతుందన్నారు. డ్రోన్ల సహాయంతో నానో యూరియా వంటి వాటి స్ప్రేయింగ్ వల్ల బహుళ ప్రయోజనాలుంటాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. సాగునీటి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు మాట్లాడుతూ అవసరం మేరకు పూర్తిస్థాయిలో లస్కర్ల నియామకాలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కృష్ణానది యాజమాన్య బోర్డును అమరావతిలో త్వరితగతిన ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. సాగునీటి సంఘాల అధ్యక్షులను గ్రామపంచాయితీ పాలకవర్గ సమావేశాలకు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులను మండల పరిషత్ సమావేశాలకు, ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను జిల్లా సమీక్ష కమిటీ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పిలిచేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ ఎడవ కాలువ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, మున్నేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పొన్నం బాలాజీ, వైస్ చైర్మన్ సిహెచ్.మౌళీశ్వరరావు, సాగునీటి సంఘాల చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.



స్త్రీశక్తి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

స్త్రీశక్తి కార్యక్రమాన్ని సమన్వయంతో విజయవంతం చేద్దాం

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకం స్త్రీశక్తిని ఈనెల 15న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రారంభించనున్న దృష్ట్యా ఇం దుకు సంబంధించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో జిల్లా అధికారులు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్ సిటీ టెర్మినల్‌లో స్త్రీశక్తి పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ముఖ్యమంత్రి స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించనున్నారని, కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యుల, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లతో పాటు రాష్ట్ర ఉన్నతాధికారులు, రోడ్డు రవాణా సంస్థ ఉన్నతాధికారులు పాల్గొంటారన్నారు. అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. పెద్దయెత్తున మహిళలు కార్యక్రమంలో పాల్గొననున్న దృష్ట్యా వారికి అవసరమైన సీటింగ్ ఏర్పాట్లతో పాటు తాగునీరు సౌకర్యం కల్పించాలని, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అత్యంత ప్రతిష్ఠాత్మక స్త్రీశక్తి కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతానికి జిల్లా అధికారులు, రాష్ట్ర రవాణా శాఖ ఇతర ఉన్నతాధికారుల సూచనల మేరకు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఏర్పాట్ల పరిశీలనలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఆర్డీవో కావూరి చైతన్య, వివిధ జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గుడివాడ కోర్టుకు వల్లభనేని వంశీ

గుడివాడ, అగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మాజీ ఎమ్మెల్యే వలంలభనేని వంశీ మోహన్ గురువారం గుడివాడ కోర్టుకు హాజరయ్యారు. ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో వారం వారం కోర్టులో సంతకాలు చేయాల్సి ఉంది. గన్నవరం కోర్టు న్యాయమూర్తి సెలవులో ఉండటంతో గుడివాడ కోర్టుకు హాజరై సంతకాలు చేశారు. ఆయన వెంట వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మెరుగు మాల కాళీ, నాయకులు పాలేటి చంటి, వెంకటేశ్వరరావు, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

సైబర్ నేరగాళ్ల వలలో ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్

మచిలీపట్నం క్రైమ్, అగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ఎంత అవగాహన కల్పిస్తున్నప్పటికి కొంత మంది సైబర్ మోసాలకు గురువుతూనే ఉన్నారు. ఈడేపల్లికి చెందిన ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ ఆన్‌లైన్ మోసానికి గురై రూ.45 లక్షలు కోల్పోయాడు. వెంటనే పోలీసులను ఆశ్రయించటంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం చిలకలపూడి పోలీస్ స్టేషన్ సీఐ అబ్దుల్ నబీని వివరణ కోరగా ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజరు మోసపోయిన మాట వాస్తమని, ఫేక్ ప్రొఫైల్‌తో కొంత మంది నిందితులు ఆయనను మోసం చేశారని వివరించారు. కేసు విచారణ దశలో ఉన్న కారణంగా మరో రెండు రోజుల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

పులివెందుల, ఒంటిమిట్టలో ప్రజస్వామ్యం గెలిచింది

● విజేతలకు అభినందనలు : ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల, ఒంటిమిట్టలలో జరిగిన ఉప ఎన్నికలలో గెలుపొందిన టీడీపీ అభ్యర్థులకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని గురువారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. పులివెందుల ఎన్నికల్లో ప్రజాస్వామ్యం గెలిచిందని ఆయన అన్నారు. పులివెందుల ప్రజలు ఇచ్చిన తీర్పుతో జగన్‌తో పాటు వైసీపీ నాయకుల వెన్నులో వణుకు మొదలైందన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలలో జరిగిన ఉప ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పు జగన్ రెడ్డికి చెంప పెట్టు అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమా మహేశ్వరరావు అన్నారు.



లూనా సెంటర్‌లో స్ట్రీట్ ఫైట్

● యువతి విషయంలో కర్రలతో దాడి

● భయంతో ప్రజల పరుగులు

విద్యాధరపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లోని లూనా సెంటర్‌లో సుమారు 50 మంది యువకులు గురువారం రాత్రి 10.30 గంటల సమయంలో రెండు గ్రూపులుగా విడిపోయి దాడులు చేసుకున్నారు. దీంతో పలువురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఓ యువతి విషయంలో తొలుత కొందరు యువకులు గొడవపడ్డారు. అది పెద్దది కావడంతో ఇరువర్గాలకు చెందిన సుమారు 50 మంది వరకు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలు వీరంగం చేసుకుంటూ కర్రలతో దాడి చేసుకున్నాయి. ఈ గొడవలో పలువురు బౌన్సర్లు కూడా పాల్గొన్నట్టు చెబుతున్నారు. భయంతో పరుగులు తీసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గొడవపడిన వారు వెళ్లిపోగా వివరాలను స్థానికు లను అడిగి పోలీసులు తెలుసుకున్నారు. ఇటువంటి గొడవలు తరచూ జరుగుతున్నాయని, అధికారులు స్పందించి పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని కోరారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వంసిద్ధం



అధికారులకు సూచనలు చేస్తున్న ఎన్టీఆర్ కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య దిన వేడుకలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి సర్వం సిద్ధంగా వుంచినట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ లక్ష్మీశ, నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర, విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ 79వ స్వాతంత్ర్య వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వేడుకలకు సంబంధించి ఇనస్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు బి.రాజకుమారి, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు కేజీవీ సరిత, ప్రోటోకాల్ డైరక్టర్ మోహనరావు సమన్వయకర్తలుగావ్యవహరిస్తారన్నారు. స్వాతం త్ర్య దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ప్రిన్సిపల్ సెక్రటరీ జీఏడీ ముఖేష్‌కుమార్ మీనా, అదనపు డీజీపీ ఎస్.మధుసూదన రెడ్డి పాల్గొంటార్నారు.



పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో...

మచిలీపట్నం క్రైమ్ : మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్ స్వాతంత్ర దిన వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. పరేడ్ రిహార్సల్ ను ఎస్పీ ఆర్. గంగాధరరావు గురువారం పరిశీలించారు. పరేడ్ కమాండర్‌గా డీఎస్పీ రాజా వ్యవహరించగా, ఎస్పీ గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ జాగిలం ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసింది. కవాతులో పాల్గొన్న పోలీసులు, క్యాడెట్‌లను ఉద్దేశించి ఎస్పీ సందేశమించ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం చోటుచేసుకోకుండా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు సూచించారు. వాహనాల పార్కింగ్ విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు.



ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డీఆర్ఎం మోహిత్ సోనాకియా

విభజన దృశ్యాల ఫొటో ప్రదర్శన

రైల్వే స్టేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : దేశానికి స్వాతంత్ర్యం ప్రకటించిన 1947వ సంవత్సరంలో జరిగిన విభజన సంఘటనల చిత్రాలను విజయవాడ రైల్వే స్టేషన్‌లో స్వాతంత్ర్యం దినోత్సవం సందర్భంగా గురువారం డీఆర్ఎం మోహిత్ సోనాకియా ప్రారంభించారు. విజయవాడ రైల్వే స్టేషన్ తూర్పు బుకింగ్ కౌంటర్ల ద్వారం వద్ద పాత బుకింగ్ ఆఫీసు ప్రాంగణంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. సోనాకియా మాట్లాడుతూ నాటి సంఘటనలను గుర్తు చేస్తూ ఈ ప్రదర్శనను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. స్వాతంత్ర్య పోరాటంలో రైల్వేలు కీలక పాత్ర పోషించాయన్నారు. విభజన సమయంలో లక్షలాది మందికి రవాణాలో ఆశా కిరణంగా రైల్వేలు నిలిచాయన్నారు. విజయవాడ డివిజన్‌లో డిజిటల్ మ్యూజియం కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ కొండా శ్రీనివాసరావు, బ్రాంచ్ అధికారులు, పాల్గొన్నారు.



ఉప్పుసత్యాగ్రహం జరుగుతున్న 1930లో తోట నరసయ్య 15 మంది పోలీసులు లాఠీచార్జి చేస్తున్నా నిర్భయంగా 45 నిమిషాలు మువ్వన్నెల జెండా ఎగురవేశారు. లాఠీచార్జి చేసిన పోలీసులే ఆగస్టు 15న ఆయనకు సెల్యూట్ చేశారు. తోట నరసయ్య విగ్రహాన్ని మచిలీపట్నంలో ఏర్పాటు చేసేందుకు మంత్రి రవీంద్ర ముందుకు వస్తారని ఆశిద్దాం.

(మచిలీపట్నం టౌన్)

గుడివాడ - పామర్రు

● గుడ్లవల్లేరు ● నందివాడ ● పెదపారుపూడి ● మొవ్వ



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505

ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎంపీడీవో

పెదపారుపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి మొవ్వరులో పాటిగేతుల చెరువులోనీటి మట్టం పెరిగింది. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ నుంచి ఆయిల్ ఇంజన్ ఏర్పాటు చేసి నీటిని వన్నేరు డ్రెయిన్‌లోకి మళ్లించనున్నామని పెదపారుపూడి ఎంపీడీవో విజయదేవి తెలిపారు. గురువారం వరద ముంపునకు గురైన ప్రాంతాన్ని ఆమె సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీను నాయక్, డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, అనిల్ కుమార్, రాజేష్, పాల్గొన్నారు.


ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న విజయదేవి

జాతీయజెండా దిమ్మెకు చోటేది ..!

● జెండా దిమ్మెను కట్టడం మరిచారు
● పంచాయతీ కార్యాలయంలో జెండా దిమ్మె తొలగింపు


డీఎస్పీ కార్యాలయం వద్ద..

(ఆంధ్రజ్యోతి - గుడివాడ): కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయం వద్ద జాతీయజెండా దిమ్మెను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. జిల్లాలోనే పేరుగాంచిన గుడివాడలో పలు కార్యాలయాల్లో జాతీయ జెండా దిమ్మెకు చోటు లేకుండా చేశారు. ఇటీవలే కోట్లాది రూపాయల పట్టణ ప్రముఖ విరాళాలతో అప్పటి ఎమ్మెల్యే కొడాలి నాని అనుంగ అనుచరుడు కాంట్రాక్టర్ అవతారమెత్తి డీఎస్పీ కార్యాలయం, గృహాన్ని నిర్మింపజేశారు. కార్యాలయానికి, గృహానికి కావలసిన అన్నిటిని అమర్చుకున్నారు. సెడీరీరాదానికి పైన అతిథిగృహాన్ని సైతం ఏర్పాటు చేశారు. కాని జాతీయ జెండా దిమ్మెను కట్టించడం మరిచారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవం రోజున జాతీయ జెండాను ఆవిష్కరించాలంటే అప్పటికప్పుడు ప్రమ్ములో ఇసుకను నింపి సరుగు బాదును నిలబెట్టి జాతీయ జెండా ఆవిష్కరిస్తున్నారు. తర్వాత రోజున ప్రమ్మును తొలగిస్తున్నారు. వాహనాలు పెట్టుకునేందుకు అడ్డుగా ఉంటుందనో, బిల్డింగ్ అందం పోతుందనో, కట్టలేనే అలోచనే రాలేదో అర్థం కాలేదు.

మల్లాయపాలెం గ్రామ పంచాయతీ ఆవరణలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జాతీయ జెండా దిమ్మెను తొలగించారు. తొలగించిన జెండా దిమ్మెను కట్టడంను వదిలేశారు. అదే విధంగా కార్యాలయాన్ని పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద కూడా జెండా దిమ్మె లేదు. సీడీపీవో, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పలుమార్లు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించేందుకు వచ్చిన జెండా దిమ్మెను కట్టించాలనే ఆలోచన రాకపోవడం శోచనీయం.


మల్లాయపాలెం గ్రామ సచివాలయం వద్ద..

బుడమేరు సమస్యకు పరిష్కారం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బుధవారం కురిసిన వర్షానికి కాలువలు, రోడ్లు మునిగిపోవటంతో అప్రమత్తమైన అధికారులు. విజయవాడ నుంచి బుడమేరు ఉగ్రరూపం దాల్చగా, నందివాడ మండలం పుట్టగుంట వద్ద బుడమేరు వంతెనకు అనుకుని నీరు క్రిందకు ప్రవహిస్తుండటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా గురువారం గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము బుడమేరు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ముందు చూపుగా నీటి సంఘాలు ఏర్పరిచి కాలువల ద్వారా తూడు తొలగింపు పనులు చేపట్టడంతో బుడమేరు ద్వారా నుంచి వచ్చే నీరు కిందకు వెళ్లటానికి ఎటువంటి ఆటంకం లేదన్నారు. గత ప్రభుత్వంలో తూడు తొలగింపు పనులు బిల్లులకే పరిమితం కావటంతో కొద్ది పాటి వర్షానికే గ్రామాలు మునిగిపోయేవన్నారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వ ముందు చూపుతో బుడమేరు కరకట్ట పనులు కాలువల పనులపై తగు చర్యలు తీసుకోవటంతో ముంపు ప్రమాదం తగ్గిందన్నారు. ఇదేవిధంగా పెద్ద గాడి వద్ద తూడు పేరుకుపోయిందని, అక్కడ కూడా తూడు తొలగింపు పనులు చేపడితే ముంపు ప్రాంతాలు మునక కనిపించవన్నారు. బూరగడ్డ శ్రీకాంత్, డీఈ నాగేంద్ర కుమార్, ఏఈ అనిల్, డీఈ కామేశ్వరరావు, టీడీ కిషోర్, ఆర్‌ఐ గణేష్, తదితరులు పాల్గొన్నారు.


బుడమేరు వద్ద పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న వెనిగండ్ల

గుడివాడ: స్త్రీశక్తి పథకంలో భాగంగా నేటి నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని మహిళలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. గురువారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ గుడివాడ డిపోలోని 87 బస్సులకు గాను 57 బస్సులను మహిళల ఉచిత బస్సు పథకానికి కేటాయించినట్లు పేర్కొన్నారు.

లంక గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ

తోట్లవల్లూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అధికారులు, సిబ్బంది సాహసం చేశారు. గురువారం కృష్ణా నదిపాయల్లో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదకు పొట్టిదిబ్బ లంక, తుమ్మలపచ్చికలంక గ్రామాల వద్ద విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. దీంతో ఈ రెండు లంక గ్రామాలకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. మెట్టు వరదతో కరెంటు లేకుండా ప్రజలు ఇబ్బందులు పడతారని, ఎలాగైనా ఆ రెండు గ్రామాలకు కరెంటు ఇవ్వాలని విద్యుత్ ఏఈ దేవదాసు, సిబ్బంది సంకల్పించారు. రెవెన్యూ అధికారులు సమకూర్చిన రెండు పడవల్లో సిబ్బంది వరదలో ప్రయాణించి పడిపోయిన స్తంభాల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద జంపర్లను తప్పించారు. ఆ తరువాత రాజేష్ గడ్డ వైపు నుంచి వరదలోనే పడవల సహాయంతో వైర్లు తెచ్చి స్తంభాలకు కట్టి పొట్టిదిబ్బలంకకు, తుమ్మలపచ్చికలంకకు విద్యుత్‌ను పునరుద్ధరించారు. ఒక్క పూటలోనే విద్యుత్‌ను పునరుద్ధరించటంపై ప్రజల నుంచి ప్రశంసలు అందుకున్నారు. మామూలుగా అయితే వరద తగ్గిన తరువాత చేయగలిగిన పనిని నిండు వరదలో చేపట్టటం సిబ్బంది సాహసం చేశారని ప్రజలు కొనియాడారు. ఈఈ కృష్ణనాయక్, డిప్యూటీ ఇంజనీర్ హేమకుమార్ ఏఈని, సిబ్బందిని అభినందించారు.


విద్యుత్ లైన్ తీసుకొచ్చి వైర్లు అమరుస్తున్న సిబ్బంది

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

● ఎంఈవో-1 సీహెచ్ రజని

గుడివాడ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కగా బోధిస్తున్నారని ఎంఈవో-1 సీహెచ్.రజని అన్నారు. గురువారం లింగవరం ప్రాథమిక, యూపీ, నాగవరప్పాడు ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. విద్యార్థులకు పలు అంశాలపై ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు చక్కగా ప్రతిభ కనబరుస్తున్నారని కొనియాడారు. ఇంగ్లీష్, తెలుగు అన్ని సబ్జెక్టుల్లో అడిగిన విషయాలు తడుముకోకుండా చెబుతున్నారని కితాబు ఇచ్చారు. ప్రతీ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కటి బోధన చేయాలని కోరారు. పాఠశాలకు వచ్చిన తర్వాత ఇతర వ్యాపకాలు పెట్టుకోవద్దని ఉపాధ్యాయులతో తెలిపారు. విద్యార్థులకు విద్యాబోధన చేయించటంతోపాటు వారికి సమాజంలో జరుగుతున్న మార్పులు చేర్పులు తెలియజేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలతో సమానంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


లింగవరం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేస్తున్న రజని

ప్లాట్ల క్రమబద్ధీకరణను వినియోగించుకోండి

● మున్సిపల్ కమిషనర్ మనోహర్

గుడివాడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2025ను పొడిగిస్తూ సవరణ ఉత్తర్వులను జారీ చేసిందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 31.12.2020 నాటికి దరఖాస్తు చేసుకోలేని ప్లాట్ యజమానులకు ప్రయోజనం కలిగించేందుకు, 30.06.2025కి ముందు వేసిన అనధికార లేఅవుట్లలో రిజిస్టర్ కాబడిన అనధికార ప్లాట్లను క్రమబద్ధీకరించేకునేందుకు పథకాన్ని కొనసాగింపు చేసినట్లు తెలిపారు. అపరాధ రుసుంలో 50శాతం లేదా రూ.10లక్షలు తగ్గకుండా చెల్లించి నోటిఫికేషన్ ఇచ్చిన నాటినుంచి 90రోజుల లోపు సంబంధిత యాజమాన్యపు హక్కు పత్రములు, ప్లానులతో ఆన్‌లైన్ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://డీటీసీపీ.ఏపీ.జీవోవీ.ఇన్/ఎల్ఆర్ఎస్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

పామర్రు, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా మెలగాలని కనుమూరు పీహెచ్‌సీ వైద్యుడు టి.రాజేష్ అన్నారు. గురువారం పట్టణంలో వైద్య సిబ్బంది చేస్తున్న ఫీవర్ సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాసిత ప్రదేశాల్లో ఈగలు, దోమలు ఉండకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి వడపోసిన నీటినే తాగాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఎదుగుదలకు కృషి చేయాలి

● శ్రీనివాసరాజు

గుడ్లవల్లేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జీవితంలో ఎదుర్కొనే సవాళ్లను, ఆనందాలను ఎదుర్కొంటూ వ్యక్తిగత ఎదుగుదలకు కృషి చేస్తూ, సమాజానికి భరోసా ఒక సంపూర్ణమైన జీవనశైలి కల్పించడమనే జీవనకళ గొప్పదనమని ప్రముఖ జీవనకళ నైపుణ్య శిక్షకులు దండు శ్రీనివాసరాజు అన్నారు. గురువారం శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు మానసిక ఆరోగ్యం- పోషకుని జీవన కళ అవశ్యకత అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షకులుగా విచ్చేసిన శ్రీనివాసరాజు మాట్లాడుతూ సమతుల్యత, సానుకూలత, సృజనాత్మకత, అనుబంధం, కృతజ్ఞత నిరంతర అభ్యాసం వంటి అంశాలను సమన్వయం చేసుకొంటూ జీవితాన్ని ఒక కళగా మలుచుకోవడమే జీవనకళ అని అన్నారు. ఈసందర్భంగా శ్రీనివాసరాజుని ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, డైరెక్టర్ ఆకా డాక్టర్ ఎంకామరాజు, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్స్ ఎల్.ఆర్ శ్రీనివాస్, ఎస్.సురేష్ పాల్గొన్నారు.


శ్రీనివాసరాజు ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ కరుణకుమార్

దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలి

● ఏపీఎంపీహెచ్.తిరుపతయ్య

పామర్రు, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): విధినిర్వహణలో విచారణకు వెళ్లిన వెలుగు ఏపీఎం రజనిపై దాడికి పాల్పడిన నిందితులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పామర్రు మండల వెలుగు ప్రాజెక్టు ఏపీఎంహెచ్.తిరుపతయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. అన్నమయ్య జిల్లా పెద్దకడబూరులో విచారణ నిమిత్తం వెళ్లిన వెలుగు ఏపీఎం రజనీపై దాడికి పాల్పడ్డారని ఖండిస్తూ గురువారం స్థానిక వెలుగు కార్యాలయం వద్ద ఐకేపీ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం తిరుపతయ్య మాట్లాడుతూ ఇలాంటి దుశ్చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. నిందితులపై చర్యలు తీసుకుని బాధితురాలికి తగు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వెలుగు కార్యాలయ సీసీ డి.స్వప్నమణి, యేసుమణి, వీవోఏస్ దుర్గా, నవీన, పద్మారూసీ, నరేష్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న వెలుగు సిబ్బంది



టీడీపీ అభ్యర్థుల గెలుపుపై సంబరాలు

పెదపారుపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు భారీ విజయం సాధించటంతో పెదపారుపూడి మండల పరిధిలోని వెంట్రప్రగడలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో స్థానిక పీఏసీఎస్ అధ్యక్షులు కూనిషెట్టి సుబ్బయ్య, మాజీ సర్పంచ్ గొరిపర్తి రవికుమార్, గ్రామ పార్టీ అధ్యక్షులు జాజుల ప్రసాద్, పార్టీ నాయకులు మాయల విజయబాబు, సజ్జా శివ కుమార్, నూ తక్కి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొని బాణాసంచా కాలుస్తూ, మిఠాయిలు పంచిపెట్టి చేశారు. కూటమి అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలే తమ పార్టీకి పట్టుకొమ్మలని ఈ ఉప ఎన్నికలో రుజువైంది అని మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి తెలిపారు. పులివెందుల, ఒంటిమిట్టలో జరిగిన ఉప ఎన్నికల్లో 2 జడ్పీటీసీ స్థానాలనటీడీపీ భారీ మెజార్టీతో కైవసం చేసుకుందన్నారు.


స్వీట్లు పంచుకుని సంబరాలు చేస్తున్న నేతలు

లైసెన్సు లేకుండా వాహనాలు నడపొద్దు

● డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఎటువంటి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మైనర్లు వాహనాలను నడపరాదని, నడిపితే చర్యలు తప్పవని డీఎస్పీ ధీరజ్ వినీల్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏజేకే సెంటర్‌లో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్‌లకు వాహనాలిస్తున్న తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వనున్నామన్నారు. అదే విధంగా బుల్లెట్ వాహనాలకు ఇతర భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లను అమరిస్తే చర్యలు తీసుకుని, వాహనాన్ని సీజ్ చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సీఐ హనీష్, ఎస్సైలుపాల్గొన్నారు.

నందివాడ: నందివాడ మండలం పుట్టగుంట వద్ద బుడమేరు వరద ఉధృతిని గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్, డ్రెయినేజీ ఏఈ అనిల్, ఎస్సై శ్రీనివాస్ పరిశీలించారు.


వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ధీరజ్ వినీల్

బొడ్డురాయి పునఃప్రతిష్ఠ

కూచిపూడి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి అగ్రహారంలో గ్రామదేవత అయిన బొడ్డురాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం వేదపండితులు రాళ్లపల్లి అంజనేయశాస్త్రి పర్యవేక్షణలో నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ అనంతరం బొడ్డురాయి నిలబెట్టారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



నానో యూరియాపై అవగాహన తప్పనిసరి

గుడివాడ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): యూరియాకు బదులుగా నానో యూరియాను వినియోగించుకోవాలని ఏడీఏ ఎస్.కవిత అన్నారు. గురువారం కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ యూరియా కొరత లేకుండా ప్రయత్నిస్తున్నామని, యూరియా కొరత ఉంటే నానో యూరియా తీసుకుని యూరియా చల్లినట్లు పిచికారి చేసుకోవాలన్నారు. ప్రతి రైతూ నానో యూరియా గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. సచివాలయ పరిధిలో వీఏఏలు గ్రామాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులు ఎప్పటికప్పుడు సమాచారం తెలియజేస్తున్నారు.

జనసేనలో చేరిక

గుడివాడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వివిధ పార్టీలకు చెందిన నాయకులు జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ సమక్షంలో గురువారం పార్టీలో చేరారు. స్థానిక జనసేన నియోజకవర్గ కార్యాలయంలో 21వ వార్డు మందపాడుకు చెందిన కొలవెన్ను కొండలరావు, సాయినాథ్ కృష్ణార్జునరావు, కాండ్రు రవీంద్రల ఆధ్వర్యంలో 40మంది జనసేనలో చేరారు. వీరికి బూరగడ్డ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. శ్రీనివాసరావు, సాయిని రాజేష్, త్రినాథ్, షేక్ మీరా షరీఫ్‌పాల్గొన్నారు


జనసేనలో చేరిన వారితో బూరగడ్డ శ్రీకాంత్

పీఏసీఎస్ పాలకవర్గాల ప్రమాణ స్వీకారం


మేడూరు పీఏసీఎస్ పాలక వర్గం

పమిడిముక్కల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మేడూరు పీఏసీఎస్ పాలక వర్గం గురువారం ప్రమాణస్వీకారం చేసింది. గోపిశెట్టి మోహనరావు చైర్మన్, తలకటూరి అజయ్బాబు, వీరంకి శివ వెంకటేశ్వరరావు డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించారు. కేడీసీసీ బ్యాంకు మేనేజర్ టి.ఉదయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. గోపాలకృష్ణ, రామమోహనరావు, బుద్ధిబాబు, శ్రీనివాసరావు, సురేశ్‌బాబు, వెంకట సాయికృష్ణ హాజరయ్యారు.

తోట్లవల్లూరు: మండలంలోని ఐలూరు రామేశ్వర పీఏసీఎస్ పాలక వర్గం గురువారం అట్టహాసంగా ప్రమాణ స్వీకారం చేసింది. చైర్మన్‌గా దావులూరి వెంకటేశ్వరరావు(చినబాబు), సభ్యులుగా జొన్నా జగన్మోహనరావు, కమ్మిలి సాంబశివరావుల చేత కార్యదర్శి గణేష్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు కడియాల శివరామయ్య, గుమ్మడి కోటేశ్వరరావు, లోయ శివరామకృష్ణ, గుర్రం బాబన్నయ్య, పిడుగు రామబాబు, బూరగడ్డ వీరబాబు తదితరులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు.


ఐలూరు పీఏసీఎస్ పాలక వర్గం

నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవం

గుడివాడ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గుడివాడ మహిళా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గురువారం స్థానిక మాంటిస్సోరి ప్రాథమిక పాఠశాలలో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షురాలుగా వల్లూరుపల్లి లక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా డాక్టర్ కోరగాని కె.యామినీలక్ష్మి, ఉపాధ్యక్షులు జె.వి.ఎస్ రాజ్యలక్ష్మి, కె.సంధ్య ఎన్నికయ్యారు. సంయుక్త కార్యదర్శులుగా డి.ఆయిలక్ష్మి, యు.రాధ ఎన్నికయ్యారు. సభ్యులుగా కె.గీతా ప్రియదర్శిని, చైతన్యవాణి ప్రియదర్శిని, యు.పద్మావతి, వి.రాజ్యలక్ష్మి, జె.ప్రమీల, వి.జయవేణి, పి.రమ, కె.విజయ, కె.భాగ్యలక్ష్మి, సీహెచ్ చాముండేశ్వరిలు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

జాతీయ జెండాల పంపిణీ

గుడివాడ: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక సత్యనారాయణపురంలో బీజేపీ టౌన్ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) ఆధ్వర్యంలో జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉలం రాంబాబు, హుసేన్, అయ్యప్ప, వరుణ్, తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్ ప్రాథమిక పాఠశాలల్లో శ్రీకృష్ణ యాదవ సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హరికుమార్ జాతీయ జెండాలు, బ్యాడ్జీలు, పంపిణీ చేశారు.

కూచిపూడి: 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మొవ్వ వీఎస్ఆర్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవి, అధ్యాపకులు మంజుల, టీ.శ్రీకాంత్, పాల్గొన్నారు.

నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు


ముంపుబారిన అంతర్గత రహదారులు

గుడ్లవల్లేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని పలుగ్రామాల్లో కొత్తకాలనీలు నీటమునిగాయి. అంతర్గత రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. ఇళ్లలోంచి బయటకి రావాలంటే ఆప్రాంతాల ప్రజలు నానాయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వంగపల్లి డెయిన్ పూడిక సరిగా తీయని కారణంగా పోలిమెట్ల, శేరికల్వపూడి ప్రాంతాల్లో వందలాది ఎకరాలు నీటమునిగాయి. చేలలో నీరు డ్రెయిన్లలోకి వెళ్లాల్సి ఉండగా డ్రెయిన్ పొంగి డ్రెయిన్లలో నీరే చేలలోకి చేరుతున్నాయని ఆప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా డ్రెయినేజీ అధికారులు స్పందించి తూడు తొలగించాలని కోరుతున్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250
నెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ. 505	

దేవాంగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గూడూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): 'ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్లలో దేవాంగ కార్పొరేషన్ లేకపోవడం దారుణం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తక్షణం దేవాంగ కార్పొరేషన్‌కు పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలి. దానికి నిధులు మంజూరు చేయాలి.' అని దేవాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పడవల మోహన త్రినాథ్ డిమాండ్ చేశారు. గురువారం పోలవరం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాంగులకు చాలా అవమానకరమని, ఆత్మాభిమానం కలిగిన లక్షలాది సామాజికవర్గీయులు మనోవేదన చెందుతున్నారని ఆయన అన్నారు. కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోతే ఆమరణ దీక్ష చేయడానికైనా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు.



చల్లపల్లి మండలం రాముడుపాలెం, మోపిదేవి మండలం వెంకటాపురంలో ముంపులోనే వరి పొలాలు, రాముడుపాలెం పుష్కరఘాట్ వద్ద ఉధృతంగా వరద, ఆముదార్లంక పల్లపు ప్రాంతంలోకి చేరిన వరద, గ్రామస్థులకు జాగ్రత్తలు చెబుతున్న డీఎస్పీ విద్యశ్రీ

చెరువుల్లా పంట పొలాలు

ఆందోళనలో రైతులు

ఘంటసాల, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూషడం, చిట్టూర్పు గ్రామాల్లో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. 15 రోజుల క్రితం నాట్లు వేసిన ఈ పొలాల్లో రెండు అడుగులకు పైగా నీరు నిలిచి ఉంది. పై నుంచి వస్తున్న వరద ఉధృతికి డ్రెయిన్లు పొంగి ప్రవహించటంతో నీరు ఎగతట్టి పొలాల్లో నుంచి కదలడం లేదు. రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 1399 మంది రైతులకు చెందిన 814.4 హెక్టార్లలో పంట నీటమునిగిందని ఇన్‌చార్జ్ ఏవో లక్ష్మీ రామ్మోహనరావు తెలిపారు.



పత్రచివరలో నీటమునిగిన పొలాలు పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

వరద ఉధృతి పరిశీలన



శ్రీకాకుళం రేవు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయప్రసాద్

కృష్ణానదికి వస్తున్న వరద ఉధృతిని తహసీల్దార్ విజయప్రసాద్, ఎంపీడీవో సుబ్బారావు పరిశీలించారు. శ్రీకాకుళం, పాపవినాశనం ర్యాంపుల వద్దకు వరద నీరు రావటం గమనించిన అధికారులు రెవెన్యూ, పోలీసు, సచివాలయ ఉద్యోగులను అప్రమత్తం చేసి వారికి అక్కడ డ్యూటీలు వేశారు. ఎవరినీ నదిలోకి వెళ్లనివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

మూడు వేల ఎకరాలకుపైనే..

మోపిదేవి: మండలంలోని వెంకటాపురం, పెదకళ్లేపల్లి, కె.కొత్తపాలెం, పెదప్రోలు, మోపిదేవి గ్రామాల్లో దాదాపు 3 వేల ఎకరాలకుపైగా వరి పొలాలు నీట మునిగాయి. నీటిని బయటకు మళ్లించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు.

ముంపు పొలాల పరిశీలన

నాగాయలంక: మండలంలో వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి. ముంపు బారిన పడిన పొలాలను డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు రైతులతో కలిసి పరిశీలించారు.

వలకట్ల తొలగింపు

కోడూరు: జరుగువానిపాలెం వద్ద నుంచి సంగమేశ్వరం అవుట్ ఫాల్ స్లూయిస్ వరకు రత్నకోడు డ్రెయినేజీలో వలకట్లను అధికారులు పూర్తిగా తొలగించకపోవడంతో రైతులు స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. రోడ్ల సమీపంలో, జనసంచారం ఉన్న ప్రదేశంలో కంటికి కనిపించే వలకట్లను మాత్రమే అధికారులు తొలగించారని ఇరాలి, చింతకోళ్ల గ్రామాల మధ్యలో వలకట్లను తొలగించలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పూర్తిస్థాయిలో వలకట్లను తొలగించాలని కోరుతున్నారు.

మంగలేరులో..

నాగాయలంక: నాలి సమీపంలో మంగలేరు మీడియం డ్రెయినేజీలో ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వలకట్లను కూలీలతో అధికారులు తొలగించారు. డ్రెయినేజీ శాఖ డీఈఈ జె.బాబూనాయక్, ఏఈఈ చిరంజీవి పర్యవేక్షించారు.

1765 ఎకరాలు మునక

చల్లపల్లి: మండలంలో 1765 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగినట్టు వ్యవసాయశాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. పాగోలు, మేకావారిపాలెం, మంగళాపురం, పాతమాజేరు, చింతలమడ, వక్కలగడ్డ, చల్లపల్లి, పురిటిగడ్డ గ్రామాల్లో పొలాలు ముంపు బారిన పడ్డాయి. మేకావారిపాలెం, చింతలమడ, రాముడుపాలెంలో పలుచోట్ల వరిచేలు చెరువులను తలపిస్తున్నాయి.

ఆముదార్లంకలో డీఎస్పీ పర్యటన

వరద ప్రభావిత గ్రామం ఆముదార్లంకను అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ సందర్శించారు. వరద పరిస్థితిని సమీక్షించారు. పల్లపు ప్రాంతాల్లోకి చేరిన వరదనీటిని పరిశీలించారు. వరద పెరిగితే పల్లపు ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రదేశాలకు రావాలని సూచించారు. ఎస్‌ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పంటపొలాలు పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఘంటసాల కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తల బృందం మాజేరు, లక్ష్మీపురం గ్రామాల్లో నీటిముంపునకు గురైన పంటపొలాలను పరిశీలించారు. రైతులకు కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి సూచనలు, సలహాలు అందించారు.

పోలీసుల శ్రమదానం

చల్లపల్లి/మోపిదేవి: ఈదురుగాలులకు నడకుదురు కరకట్టపై విరిగిపడిన చెట్లను పోలీసు అధికారులు తొలగించారు. చల్లపల్లి మండల పరిధిలోని రాముడుపాలెం, నాదెళ్లవారిపాలెం, మోపిదేవి మండల పరిధిలోని కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో కరకట్టపై చెట్లు విరిగిపడ్డాయి. అత్యవసరంగా కొన్నిచెట్లను యంత్రంతో కోసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేసినప్పటికీ, మరికొన్ని చెట్లు అలాగే పడిఉన్నాయి. కరకట్టపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో విరిగిన చెట్లను తొలగించేందుకు పోలీసులే రంగంలోకి దిగారు. గురువారం సాయంత్రం చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ఆధ్వర్యంలో మోపిదేవి ఎస్సై సత్యనారాయణ, పోలీసు సిబ్బంది శ్రమదానం చేశారు. విరిగిపడి రోడ్డుకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

బలహీనంగా ఉన్నచోట కరకట్ట పటిష్టపరచండి

● అధికారులకు జడ్పీ సీఈవో కన్నమనాయుడు ఆదేశం

కోడూరు: కరకట్ట బలహీనంగా ఉన్న చోట పటిష్టపరచాలని అధికారులను జిల్లా పరిషత్ సీఈవో కె.కన్నమనాయుడు ఆదేశించారు. కృష్ణానది కరకట్టపై కోతకు గురవుతున్న ప్రదేశాలను ఆయన పరిశీలించారు. పిట్టలంక, ఉల్లిపాలెం, కోడూరు అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద ముందు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. ఎంపీడీవో సుధాప్రవీణ్, ఇరిగేషన్ ఏఈ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కోతకు గురైన కట్ట

కోడూరు మండలం ఉల్లిపాలెం - హంసలదీవి గ్రామాల మధ్య కృష్ణానది కరకట్ట పలు చోట్ల కోతకు గురవుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తుండడంతో ప్రమాదం పొంచి ఉందని పరివాహక ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



ఉల్లిపాలెం - హంసలదీవి మధ్య కోతకు గురైన కృష్ణా కరకట్ట



మాజేరు లింగన్నకోడు వంతెన వద్ద గుర్రపుడెక్కను పరిశీలిస్తున్న పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు

అహర్నిశలూ శ్రమిస్తున్న యంత్రాంగం

చల్లపల్లి: పొలాలకు ముప్పువాటిల్లకుండా మురుగు కాల్వల్లో గుర్రపుడెక్కను తొలగించి నీటిపారుదలకు అవరోధం లేకుండా అధికార యంత్రాంగం అహర్నిశలూ శ్రమిస్తోందని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. కొత్తమాజేరు లింగన్నకోడు వంతెన వద్ద ఎగువ నుంచీ కొట్టుకువచ్చిన గుర్రపుడెక్కను ఆయన పరిశీలించారు. డ్రైనేజీ శాఖ డీఈఈ బాబూనాయక్, ఏఈఈ చిరంజీవి పర్యవేక్షణలో యంత్రాల సాయంతో గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఎంపీపీ కోట విజయరాధిక, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, డీసీ వైస్ చైర్మన్ పరిశె చలపతి పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ పాఠశాలల్లో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. గాంధీ విద్యాలయం, జవ్వారుపేటలోని వెంకటేశ్వర ఇంగ్లీషు మీడియం పాఠశాలలో శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణ పోటీలు అందర్నీ ఆకట్టుకున్నాయి. విద్యార్థులు కోలాట ప్రదర్శన చేశారు. ఉట్టికొట్టేందుకు విద్యార్థులు పోటీపడ్డారు.



గోపిక, కృష్ణుడి వేషధారణలో చిన్నారులు

వాసవీ ఇంజనీరింగ్ కాలేజీలో..

పెడన రూరల్: నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు ఉట్టి కొట్టి, నృత్య ప్రదర్శనలు చేశారు. కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు, డైరెక్టర్ దోసపాటి బాబా, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డి.రాజారమేష్ పాల్గొన్నారు.

దేశభక్తిని చాటేలా తిరంగా ర్యాలీలు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం నగరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు జాతీయ జెండాలు చేతబూని దేశభక్తిని చాటేలా హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించారు. పొడవాటి జాతీయ జెండాతో గాంధీ విద్యాలయం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డీఆర్వో కె.చంద్రశేఖరరావు ప్రారంభించారు. పాలకమండలి అధ్యక్షుడు మెహర్‌బాబా, కార్యదర్శి కిషోర్, కన్వీనర్ చక్రవర్తి, హెచ్‌ఎం భవానీ పాల్గొన్నారు. స్టార్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో విద్యాసంస్థల అధినేత పి.శ్రీరాం, ఆదిత్య పాల్గొన్నారు.



నాగాయలంక హైస్కూల్‌లో జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



మచిలీపట్నంలో తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో కె.చంద్రశేఖరరావు

నాగాయలంక జడ్పీ పాఠశాలలో..

నాగాయలంక: నాగాయలంక జడ్పీ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు 100 మీటర్ల జాతీయ జెండాను ప్రదర్శించి దేశభక్తిని చాటుకున్నారు. హెచ్‌ఎం ఎ.సత్యనారాయణ పాల్గొన్నారు.

అవనిగడ్డలో..

అవనిగడ్డ: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగార్జున నేతృత్వంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ సేవా పథకం యూనిట్, యూత్ రెడ్‌క్రాస్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ఈ మెగా ర్యాలీలో విద్యార్థులు మేరా భారత్ మహాన్‌కిజై, భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. రాజీవ్‌గాంధీ చౌక్ వద్ద యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు మానవహారం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎ.వీరకుమారి, ఈక్యూఎస్సీ కో-ఆర్డినేటర్ రాజనాల అంకారావు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ గరికపాటి హరిప్రసాద్, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అవనిగడ్డలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్ తదితరులు

టీడీపీ విజయోత్సవాలు

అవనిగడ్డ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మూడు దశాబ్దాలుగా నిరంకుశత్వంతో నలిగిపోతున్న పులివెందుల ప్రజలకు పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికలు ప్రజాస్వామ్యంపై నమ్మకాన్ని కలిగించాయని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ భారీ మెజార్టీతో విజయం సాధించడంతో అవనిగడ్డలో ఆ పార్టీ సీనియర్ నేతలు బొబ్బా గోవర్ధన్, కొల్లూరి వెంకటేశ్వరరావు, మండవ బాలవర్ధిరావు, బండే శ్రీనివాసరావు, పరుచూరి దుర్గాప్రసాద్ నేతృత్వంలో విజయోత్సవాలు నిర్వహించారు. రాజీవ్‌గాంధీ సెంటర్‌లో టపాసులు పేల్చి కేక్ కట్ చేశారు. పులివెందుల పాయె అంటూ విరిగిపోయిన ఫ్యాన్‌ను ముద్రించిన పోస్టర్‌ను ప్రదర్శించారు. ఓటు ద్వారా జగన్మోహన్‌రెడ్డికి ప్రజలు గుండు కొట్టించారని నినాదాలు చేశారు. బండే రాఘవ, మండలి రామ్మోహనరావు, ఘంటసాల రాజమోహనరావు, కోట సాయి, మేడికొండ విజయ్, షేక్ బాబావలి, బీజేపీ నేతలు జివి.నగరాయులు, టి.వి.గిరి పాల్గొన్నారు.

గూడూరు ప్రధాన సెంటర్‌లో..



స్వీట్లు పంచుతున్న కూటమి నాయకులు

గూడూరు: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ స్థానాలు టీడీపీ గెలిచినందుకు గూడూరు ప్రధాన సెంటర్‌లో కూటమి నాయకులు బాణాసంచాలు కాల్చి మిఠాయిలు పంచారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఎన్‌ఏ బేగ్, జనసేన నాయకులు పోతన రామోజీ, సూరారపు ఆంజనేయులు, పోతుల రాము, మునగాల భాస్కర్, బొర్రా శ్రీను, కటకం నాగమల్లేశ్వరరావు, గొరిపర్తి రాజాబాబు, పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

● పెదప్రోలు పీఏసీఎస్ చైర్మన్‌గా నాదెండ్ల శరత్ చంద్రబాబు

మోపిదేవి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): పెదప్రోలు పీఏసీఎస్ చైర్మన్‌గా నాదెండ్ల శరత్ చంద్రబాబు, సభ్యులుగా ఎడ్లపల్లి నాగమల్లేశ్వరరావు, మోర్ల జయ నాగ శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పీఏసీఎస్ ఉద్యోగులు, కూటమి నేతలు అభినందనలు తెలిపారు.

వి.కొత్తపాలెం

పీఏసీఎస్ చైర్మన్‌గా రేపల్లె పిచ్చేశ్వరరావు

కోడూరు: వి.కొత్తపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా పీఏసీఎస్ చైర్మన్‌గా రేపల్లె పిచ్చేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనపై నమ్మకం ఉంచి తనకిచ్చిన పదవికి మచ్చ రాకుండా పనిచేస్తానని, రైతులకు సకాలంలో వ్యవసాయ రుణాలు అందించి రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో చుండూరు రమేష్, నాయకులు మర్రె గంగయ్య, కోట రాంబాబు, జరుగు పోతురాజు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా

బొందలపాటి వీరబాబు

చల్లపల్లి: చల్లపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా బొందలపాటి వీరబాబు, సభ్యులుగా వేముల హరికృష్ణ, ఆలూరి విశ్రాంతమ్మ గురువారం సొసైటీలో బాధ్యతలు స్వీకరించారు. వారిని సీఈవో తోట కృష్ణారావు, ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, కూటమి నేతలు మోర్ల రాం బాబు, అడపా రాంబాబు, నూకల లక్ష్మయ్య, రావి రాజేశ్వరరావు, గంగిశెట్టి రాజేంద్ర, అంబటి భువనేశ్వరరావు, షేక్ నసీం ఘోరి, బుల్లా కిషోర్, బత్తుల ప్రసాద్, అడపా రవి తదితరులు సత్కరించారు. అభినందనలు తెలిపారు.



హెచ్‌ఎం భాగ్యలక్ష్మిని సత్కరిస్తున్న మట్టా రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు

బంగ్లా స్కూల్ హెచ్‌ఎంకు సత్కారం

పెడన, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీపీ పాఠశాల(బంగ్లా స్కూల్) ప్రధానోపాధ్యాయిని జి.భాగ్యలక్ష్మిని పాఠశాల పూర్వ విద్యార్థి, విశ్రాంత జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి మట్టా రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులు సన్మానించారు. ఇటీవల ఆ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నందుకు హెచ్‌ఎంను అభినందించినందకు ఈ సన్మామన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో 2 వై.వి.హరనాథ్, ఎస్‌ఎంసీ వైస్‌చైర్మన్ ఎండీ బాబు, సీఆర్పీలు హమీద్, హమీదుల్లా తదితరులు పాల్గొన్నారు.

హిందూ చైతన్య వేదిక మండల సంయోజక్‌గా బ్రహ్మాజీ

పెడన, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హిందూ చైతన్య వేదిక మండల సంయోజక్‌గా యార్లగడ్డ బ్రహ్మాజీ నియమితులయ్యారు. బ్రహ్మాజీకి హిందూ చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు నాదెళ్ల కోటేశ్వరరావు బాధ్యతలు అప్పగించారు. వేదిక జిల్లా ఆర్థిక ప్రముఖ్ తోట హరిబాబు, నియోజకవర్గ సంయోజక్ బందారు రంగబాబు పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జయంతిని ప్రభుత్వం జరిపించడం ముదావహం

● ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని కూటమి ప్రభుత్వం ఈనెల 16న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 10 గంటలకు అధికారికంగా జరిపించేందుకు జీవో విడుదల చేయడం ముదావహమని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. గురువారం తన క్యాంపు కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. జయంతి కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు పాల్గొంటారన్నారు. గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు పాల్గొన్నారు.

తాగి వాహనాలు నడుపుతున్న 14 మందికి జరిమానా

మచిలీపట్నం క్రైమ్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 14మందిని అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి వారందరికీ రూ.25,500 జరిమానా విధించారని రాబర్ట్‌సన్ పేట సీఐ ఏసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వారిని అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు.

18న మండల సమావేశం

పెడన రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రాజులపాటి వాణి అధ్యక్షతన నిర్వహిస్తామని ఎండీవో కె.శివప్రసాద్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హాజరు కావాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో టీడీపీ నాయకుడి దుర్మరణం



మాటూరి బసవేశ్వరరావు (ఫైల్)

కృత్తివెన్ను, ఆగస్టు 14: రోడ్డు ప్రమాదంలో టీడీపీ సీనియర్ నాయకుడు మాటూరి బసవేశ్వరరావు(పెదబాబు) (55) దుర్మరణం చెందారు. ఈ ఘటన బుధవారం రాత్రి సంగమూడి గ్రామ సమీపంలో జరిగింది. ఎస్సై పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. చినగట్టు గ్రామానికి చెందిన పెదబాబు బుధవారం రాత్రి ఇంటి నుంచి కృత్తివెన్ను ప్రధాన సెంటర్‌కు వెళుతుండగా, వర్షం కారణంగా 216 జాతీయ రహదారిపై సంగమూడి సమీపాన మార్జిన్ దిగి, చెట్ల పొదల్లోకి దూసుకెళ్లారు. ఆయనపై బండి పడింది. కొంతసేపటి వరకు ఎవరూ చూడలేదు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి సమాచారమివ్వడంతో పోలీసులు వెళ్లి ప్రథమ చికిత్స అందించే ప్రయత్నం చేసినప్పటికీ పెదబాబు అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గురువారం నిర్వహించిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.